# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు
# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

OFFICIAL REPORT

మంగళవారం, ఆగస్టు 19, 2014

**TUESDAY, 19TH AUGUST, 2014**

14వ శా.స. 2 వ సమావేశం, వాల్యూం-II నంబరు-2

**14TH L.A. II – SESSION, VOL- 2, NO.2**

శక సంవత్సరం-1936, శ్రావణం -28

**28-Sravan, 1936 – S.E.**

శాసన సభ సచివాలయం

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు- 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS, NAMPALLY**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | డా. కోడెల శివప్రసాదరావు |
| ఉప సభాపతి | : | శ్రీ మండలి బుద్ధప్రసాద్ |
| కార్యదర్శి(ఇంచార్జ్) | : | శ్రీ కె.సత్యనారాయణ రావు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎం. విజయరాజు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి.వి.సుబ్బారెడ్డి<br>శ్రీ కె.రాజకుమార్<br>శ్రీమతి ఆర్.వనితారాణి<br>శ్రీ పి.నరసింహ<br>శ్రీ బి.కమలాకర్<br>డా. వై.కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె.వెంకటేశ్వరరావు<br>శ్రీ డి.జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి.ప్రభాకర్‌రావు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ శ్రీనివాస్ అల్లాడి |

---

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

**(14వ శాసన సభ)**
(రెండవ సమావేశము ః రెండవ రోజు )

**మంగళవారం, ఆగష్టు 19, 2014**
**సభ ఉ.గం.09.00. లకు ప్రారంభమైనది**
**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

--------------

# విషయ సూచిక


| | | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | సభా సమావేశం (ఉ.గం.9.00 లకు.) | ..... | 5 |
| 2. | నక్షత్ర గుర్తు గల ప్రశ్నలు మరియు సమాధానములు | ..... | 5–42 |
| 3. | సభా వ్యవహారాల సలహా సమితి నిర్ణయాలను సభ సమక్షంలో ఉంచుట | ..... | 42 & 44 |
| 5. | ప్రకటనలు (పానల్ ఛైర్మన్ నియమించుట) | ..... | 44 |
| 6. | జీరో అవర్ | ..... | 44–49 |
| 7. | సంతాప తీర్మానాలు | ..... | 49–52 |
| 8. | సభా కార్యక్రమం | ..... | 52–63 |
| 6. | సభ వాయిదా (మ. గం. 1.00 లకు) | ..... | 63 |

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ

## 14వ శాసనసభ, 2వ సమావేశం

## మంగళవారం,19వ తేది ఆగస్టు, సం.2014.

(సభ ఉదయం సమయం గం.09.00లకు సమావేశమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

* * *

ప్రశ్నలు - వాగ్రూప సమాధానములు

**MR SPEAKER: Question Hour. Question No.11 (221).**

**సర్వశ్రీ ఆదిమూలపు సురేష్ (సంతనూతలపాడు), గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి), ఎం.ఎల్.ఏ.లు.**

అ) పేరుగాంచిన విత్తన కంపెనీలు నకలు, నకిలీ విత్తనాలను విక్రయించేందుకు గుంటూరు కార్యకలాపాల కేంద్రంగా మారిందన్న విషయం వాస్తవమేనా?

ఆ) శాఖ తగిన పర్యవేక్షణ చేయనందున, నకలు, నకిలీ విత్తనాలు, పురుగు మందుల విక్రయం చాలా అధిక స్థాయిలో ఉన్నదన్న విషయం వాస్తవమేనా? అయితే, ఆ వివరాలేమిటి?

ఇ) ఒక సంవత్సరం పైబడిన పాత విత్తనాలను శీతలీకరణ గిడ్డంగులలో నిలువ ఉంచి తదుపరి సంవత్సరాల విత్తనాలతో కలిపి విక్రయిస్తున్నారనే విషయం వాస్తవమేనా?

**వ్యవసాయ శాఖా మంత్రి ( శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు, చిలకలూరిపేట):**

అ) లేదండీ.

ఆ) లేదండీ. నమూనాలను సేకరిస్తూ, తనిఖీలను నిర్వహించడం ద్వారా విత్తనాలు, పురుగుమందుల నాణ్యతను ఈ శాఖ పర్యవేక్షణ చేస్తున్నది. ప్రామాణికం లేని నమూనాలను గుర్తించినచోట చర్య తీసుకోవడం జరిగింది.

ఇ) లేదండీ. శీతల గిడ్డంగిలో నిల్వ చేసిన విత్తనాలను వివిధ లాట్‌లలోకి వేరు చేయడమయింది. శీతల గిడ్డంగులలో నిల్వ ఉంచిన ధృవీకరించిన విత్తనాల విషయంలో విత్తన ధృవీకరణ ఏజెన్సీ లాట్‌వారీ నమూనాలను సేకరించి, తదుపరి తిరిగి ప్రమాణత్వం కోసం కనీస మొలకెత్తు శాతాన్ని పరీక్షించడమవుతుంది. నిజమైన లేబుల్డ్ విత్తన విషయంలో ప్రతి పంటలో నిర్ధిష్టపర్చిన ప్రమాణాల ప్రకారం కనీస మొలకెత్తు శాతాన్ని పరీక్షించేందుకోసం సంబంధిత కంపెనీ లాట్ వారీగా నమూనాలను సేకరిస్తుంది. మార్కెట్‌కు విత్తనాలను విడుదలచేసే ముందు శాఖ కనీస విత్తన ప్రమాణాలను పరీక్షించేందుకు నమూనాలను సేకరిస్తుంది. విత్తన చట్టం ప్రకారం ముందుగా విత్తనాల యొక్క ప్రమాణత్వం (9) నెలల కాలంగా ఉంటుంది. తిరిగి ప్రమాణత్వం మరో (6) నెలల కాలానికి పొడిగించి, ఆ తర్వాత మాత్రమే విక్రయానికి అనుమతించడమవుతుంది.

మిస్టర్ స్పీకర్ః గొట్టిపాటి రవికుమార్ గారు.

శ్రీ గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి)ః మంత్రిగారు మొదటి ప్రశ్నకు సమాధానం 'లేదు' అని చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో చాలా పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలు చలామణి అవుతున్న మాట వాస్తవమని మనకందరకూ తెలిసిన విషయమే. అక్కడ నుంచే గాకుండా రాష్ట్రం నలుమూలలకు గాని, అలానే దేశం నలుమూలలకు కూడా ఈ విత్తనాలు సరఫరా అవుతున్న మాట వాస్తవమే. ఈమధ్య జూన్ 19వ తారీకున చాలా పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలను అధికారులు గుర్తించడం కూడా జరిగింది. ఆంధ్రజ్యోతి, హిందూ పత్రికలలో కూడా చాలా పెద్ద ఎత్తున నకిలీ విత్తనాల రాకెట్ల గురించి ప్రస్తావించడం జరిగింది. అలానే గుంటూరు పరిసర ప్రాంతాల్లో జిన్నింగ్ మిల్లులలో ఒక కేజీ విత్తనాల్ని 20 రూ, 30 రూ.లకు కొని వాటిని 500, 600 గ్రాముల ప్యాకెట్ల కింద మలిచి వాటిని అమాయకులైన రైతులకు ఒక్కొక్క ప్యాకెట్టుని 400 నుంచి 500 రూపాయలకు విక్రయిస్తున్న మాట వాస్తవం కాదా? ఒక్కో రైతు ఎకరానికి దాదాపు రూ.20,000 నుంచి రూ.30,000 లు ఖర్చు పెడుతున్నారు. పంట అంతా వేసి, సాగుచేసి, వ్యవసాయం పనులన్నీ చేసిన తర్వాత ఆ పంటకు పూత రాలేదని తెలిసిన తర్వాత గుండె పగిలి రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం వాస్తవం కాదా?

అట్లానే రెండవ ప్రశ్నకు సంబంధించి మానిటరింగ్ బాగా చేస్తున్నామని చెబుతున్నారు. ఇంప్రాపర్ మానిటరింగ్ వల్ల చాలామంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్న మాట వాస్తవం కాదా? అలాగే అధికారులు సీడ్ ప్రొక్యూర్‌మెంట్ చేసేప్పుడు చాలాచోట్ల సూపర్‌విజన్ కరువైపోయింది. అలాగే విత్తనాలు సరఫరా చేసేటప్పుడు కూడా సూపర్‌విజన్ లేని మాట వాస్తవం కాదా? అలానే ఏయే నార్మ్స్ ప్రకారం ఎన్ని శాంపిల్స్ తీయాలి? అవన్నీ సక్రమంగా లేనప్పుడు భారీ స్థాయిలో విత్తనాలు చలామణి అయ్యే అవకాశం ఉందా లేదా?

అలానే మూడవ ప్రశ్నకు సంబంధించి కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచిన విత్తనాలను అధికారులు రైతులకు సరఫరా చేస్తున్నారు. మామూలుగా అయితే అధికారులు ఎక్కువ దిగుబడి పండించే రైతుల దగ్గరకు వెళ్లి, విత్తనాలను స్వీకరించి, మంచి శాంపిల్స్‌ను తీసుకుని వాటిని రైతులకు సరఫరా చేయవలసిన అవసరం ఉంది. కానీ, టన్నుల కొద్ది విత్తనాలను కోల్డ్ స్టోరేజ్‌లో సంవత్సరం పైన నిల్వ ఉంచి వాటిని రైతులకు సరఫరా చేస్తున్నారన్న మాట వాస్తవం. ఎందుకంటే గత సంవత్సరం ప్రకాశం జిల్లాలో చాలా పెద్ద ఎత్తున కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచిన విత్తనాలను అప్పటికప్పుడు తీసుకుని అవే విత్తనాలను రైతులకు ఇచ్చిన మాట వాస్తవం కాదా? ఆ కార్యక్రమం చాలా పెద్ద ఎత్తున జరిగింది. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో రాబోయే సెప్టెంబరు మాసంలో చాలా పెద్ద ఎత్తున బెంగాల్ గ్రాం, ప్యాడీ పంటలను వేయబోతున్నారు. దానికి ముందస్తు జాగ్రత్త చర్యగా సరఫరా విషయంలో మీరు ఇప్పటివరకు ఏయే చర్యలు తీసుకోవడం జరిగింది? అలాగే రాబోయే సీజనుకు ముందు జాగ్రత్త చర్యగా ఇప్పటివరకు జిల్లాలకు ఎన్ని వేల టన్నులు సరఫారా చేశారు? అలానే క్వాలిటీ విషయంలో మీరు ఏయే జాగ్రత్తలు తీసుకున్నారు? అలానే వ్యవసాయపరంగా ఈ రాష్ట్ర రైతాంగానికి మీరు ఈ సంవత్సరం భరోసా ఏమి ఇవ్వబోతున్నారు?

మిస్టర్ స్పీకర్: మినిస్టరు గారు..

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట): గౌరవ సభ్యులు శ్రీ గొట్టిపాటి రవికుమార్ అడిగిన అంశాల్లోకి వెళితే అంతర్గత తనిఖీ బృందాలను పంపించి విక్రయదారులు మరియు విత్తన ప్రోసెసింగ్ యూనిట్లలో కూడా ఆకస్మిక తనిఖీలను నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా సుమారు 8,795 క్వింటాళ్ల 46 కేజీల వివిధ రకాలైన విత్తనాలను, రూ. 6,40,000 విలువ కలిగినవి సీజ్ చేయడం జరిగింది. తద్వారా నిబంధనలను అతిక్రమించిన వివిధ కంపెనీలపై ఎసెన్షియల్ కమాడిటీస్ యాక్ట్ అంటే నిత్యవసర సరుకుల చట్టం-1955ను అనుసరించి సెక్షన్ 6(ఎ) ద్వారా 47 కేసులను నమోదు చేయడం జరిగింది. ఇంతేకాకుండా చీటింగ్ కేసులు సెక్షన్ 420 ద్వారా ఐదు మందిపై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టడం కూడా జరిగింది. ప్రత్యేకించి గుంటూరు జిల్లాలో ఏడు కేసులను సెక్షన్ 6(ఎ) కింద నమోదుచేయడం జరిగింది. వీటిలో ముఖ్యంగా కావేరి సీడ్స్, నూజివీడు, రాశి, ప్రభాత్, సూపర్, యాగంటి, ఆదిత్య, అగ్రిటెక్ మొదలగు కంపెనీల విత్తనాలను కూడా సీజ్ చేయడం జరిగింది. తిరుమల సీడ్స్‌కు సంబంధించి చిల్లీస్ 16 క్వింటాళ్ల విత్తనాలను కూడా సీజ్ చేయడం జరిగింది. అదేవిధంగా 2014-15లో ఇప్పటివరకు విజిలెన్స్ శాఖ కూడా సుమారు రూ.548 లక్షలు విలువ కలిగిన 5,003 క్వింటాళ్లు వివిధ పంటలకు సంబంధించిన విత్తనాలు సీజ్ చేసి సెక్షన్ 6(ఎ) కింద 26 కేసులను నమోదు చేసి సంబంధిత కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల ద్వారా విచారణ చేపట్టడం కూడా జరిగింది. అగ్రికల్చరల్ అంతర్గత టీములు - స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసి దాడులను నిర్వహించడం ద్వారా రూ.92 లక్షలు విలువ కలిగిన 3,792 క్వింటాళ్ల విత్తనాలను సీజ్ చేసి, సెక్షన్ 6 (ఎ) కింద 20

కేసులను నమోదుచేసి కలెక్టరు ద్వారా విచారణ చేపట్టడం జరిగింది. క్రాప్‌వైజ్ సీడ్ రిక్వయిర్ మెంట్ కూడా గ్రౌండ్‌నట్ వచ్చేటప్పటికి, 7,000 క్వింటాళ్లు ఎ.పి.ఎస్.ఎస్.బి.సి. ద్వారా ఆయిల్ ఫెడ్ ద్వారా 56,910 క్వింటాళ్లు, మార్క్‌ఫెడ్ ద్వారా 27,440 క్వింటాళ్లు, బెంగాల్ గ్రాం ఎ.పి.ఎ స్.ఎస్.బి.సి. 1,36,600 క్వింటాళ్లు, ఆయిల్‌ఫెడ్ ద్వారా 45,000 క్వింటాళ్లు, మార్క్‌ఫెడ్ ద్వారా 50,000 క్వింటాళ్లు అలాట్‌చేయడం జరిగింది. రూ.33,300 లక్షలు సబ్సిడీ ద్వారా ఇవ్వడం జరిగింది.

...

ప్యాడీ-46830 క్వింటాల్స్, జోవర్-1980 క్వింటాల్స్, మెయిజ్-19873 క్వింటాల్స్, బజ్రా-6 క్వింటాల్స్, రెడ్‌గ్రామ్-20 క్వింటాల్స్, గ్రీన్‌గ్రామ్-13300 క్వింటాల్స్, బ్లాక్‌గ్రామ్-60324 క్వింటాల్స్, సెసేమ్-741 క్వింటాల్స్, సన్‌ఫ్లవర్-2919 క్వింటాల్స్, క్యాస్టర్-201 క్వింటాల్స్, రాగి-6 క్వింటాల్స్, రాజ్మా-1750 క్వింటాల్స్, కౌపి-2400 క్వింటాల్స్, దాంచాయ్-20 క్వింటాల్స్, సన్‌హెమ్-100 క్వింటాల్స్, పిల్లిపెసర-100 క్వింటాల్స్‌ని టోటల్‌గా ఎలాట్ చేయడం జరిగింది. సుమారు రూ.84883 లక్షల సబ్సిడీ ప్రభుత్వం భరిస్తోంది. అదేవిధంగా కోల్డ్‌స్టోరేజ్‌లలో సీడ్స్ నిల్వ ఉంచినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లైతే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గుంటూరు జిల్లాలో 2014-15 సంవత్సరానికి గాను, మెయిజ్, కాటన్ సీడ్స్ అక్రమ నిల్వ విషయమై దాదాపు 6 కేసులను నమోదు చేయడం జరిగింది. విత్తన చట్టాన్ని ఇంకా కఠినతరం చేయడానికి సలహాలు, సూచనలు ఎవరు చేసినా, దానిని పాటించి, మార్కెట్‌లో స్పూరియస్ సీడ్స్‌కు అవకాశం లేకుండా నియంత్రించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

మిస్టర్ స్పీకర్ః శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారూ...

శ్రీ గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి)ః సర్, ఎన్ని చట్టాలు చేసినా సరే, ఇప్పటికి కూడా పెద్దఎత్తున నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్నాయి. దానిని నివారించడానికి, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా ఇంకా కఠినతరమైన చట్టాలు తీసుకురావాలని కోరుతున్నాను. అదేవిధంగా పంటల కొరకు విత్తనాలు నాటిన తరువాత కొన్ని రోజులకు గానీ సబ్సిడీ విత్తనాలను మీరు సరఫరా చేయలేకపోతున్నారు. దానివల్ల, ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలన్నీ కూడా బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతున్నాయి. అధ్యక్షా, అదేవిధంగా ప్రకాశం జిల్లాలో పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా బెంగాల్‌గ్రామ్ పంటను తీసుకురావడం జరిగింది. రైతులందరూ చాలా పెద్దఎత్తున బెంగాల్ గ్రామ్ పంటను వేస్తున్నారు. ప్రస్తుతం చాలా పెద్దఎత్తున బెంగాల్‌గ్రామ్ కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ ఉంది. ప్రభుత్వం సహాయసహకారాలు అందించి బెంగాల్‌గ్రామ్ విత్తనాలను కొనుగోలు చేసే పద్ధతి ఏమైనా ఉందా? అని మీద్వారా అడుగుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః ఎస్. మినిస్టర్ గారూ...

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట): ఈరోజున రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో... రైతుల వద్దగానీ, కోల్డ్‌స్టోరేజ్‌లలో గానీ, ట్రేడర్స్ వద్దగానీ 43 లక్షల క్వింటాళ్ళ బెంగాల్‌గ్రామ్ నిల్వ ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. గత సంవత్సరం, రెండు సంవత్సరాల క్రింతం బెంగాల్‌గ్రామ్ కూడా నిల్వ ఉన్నది. దానికి రూ.3100ల మద్దతు ధర ఉంది. రైతులు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకోవడం, కోల్డ్‌స్టోరేజ్ రేట్లు అధికంగా ఉండడం వంటి కారణాల దృష్ట్యా రూ.3500లకు కొనుగోలు చేయాల్సిందిగా రైతుసంఘాలు కోరుతున్నాయి. రూ.3100లకు కొనుగోలు చేయడానికి సన్నాహాలు జరుగుతూ ఉన్నాయి. ఈరోజు, రేపట్లో కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోబోతోంది.

మిస్టర్ స్పీకర్: సురేష్ గారూ...

డా.ఏ.సురేష్ (సంతనూతలపాడు): అధ్యక్షా, 14వ శాసనసభా సమావేశాల్లోని మొట్టమొదటి ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మొట్టమొదటి ప్రశ్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇచ్చినందుకు నా ధన్యవాదాలు. ఆ ప్రశ్న కూడా రైతులకు సంబంధించినదై ఉండడం చాలా సంతోషదాయకం. రైతుల సంక్షేమం గురించి, వారు పడుతున్న బాధల గురించి చర్చించే అవకాశం ఈరోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇవ్వడం, తద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి, చిత్తశుద్ధితో పోరాడుతుందని సంకేతాలు పంపేందుకు అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ముఖ్యంగా మేము అడిగిన ప్రశ్నకు 'ఉందండీ, లేదండీ' అని సమాధాలు రాబట్టడానికి మాత్రం ఈప్రశ్నను అడగడంలేదు.

అధ్యక్షా, ఒకసారి లోకల్ న్యూస్ పేపర్స్‌లో చూస్తే... నేషనల్ మీడియాలో కూడా చూసినట్లైతే, హిందూ, టైమ్స్ ఆఫ్ ఇండియా పేపర్స్‌లో చూసినట్లైతే, predominantly they are discussing about Guntur, and 'Guntur turning into a hub of spurious seed companies. ఆంధ్రజ్యోతి పేపర్‌లో 'నకిలీ, కల్తీ వ్యాపారులకు వ్యవసాయాధికారుల అండ–గుంటూరు కేంద్రంగా కోట్లలో నకిలీ వ్యాపారం' అని వచ్చిన ఆర్టికల్‌కు మంత్రిగారు సమాధానమిస్తూ 'వారి అంతు చూస్తాం' అని చెప్పడంజరిగింది. కానీ, ఈరోజు మంత్రిగారు ఇచ్చిన సమాధానంలో 'లేదండీ' అని సమాధానమిస్తూ, గుంటూరు జిల్లాలో 7 కేసులు బుక్ చేశామని చెబుతున్నారు. అధ్యక్షా, ఈవిషయమై మీరు దృష్టిసారించాల్సిన అవసరముంది. In Times of India, a news item was printed stating that fake seeds haunt coastal A.P. farmers. ఇక్కడ ప్రధానంగా రెండు అంశాలు ఉన్నాయి. 1. నకిలీ విత్తనాలు, 2. కల్తీ విత్తనాలు.

కేవలం విత్తనాలకు సంబంధించి మాత్రమే కాకుండా it is spreading to pesticides and also to fertilizers. ఈరోజుల్లో పెస్టిసైడ్స్ విషయంలో రైతాంగం చాలా నష్టపోతోంది.

పెస్టిసైడ్స్‌లో మందుకన్నా కిరోసిన్ ఎక్కువగా ఉంటోంది. లేబ్లింగ్ విషయంలో కూడా ఒరిజినల్ దానికన్నా చాలా పగడ్బందీగా చేస్తున్నారు. ఇటువంటి వాటి నుండి రైతులను ఏవిధంగా రక్షించాలనే విషయమై ఈసభ ద్వారా ప్రభుత్వం రైతులకు ఏవిధమైన హామీ ఇస్తుంది? ప్రకృతి కూడా మనకు సక్రమంగా సహకరించడం లేదు. ఇటువంటి రోజుల్లో, మనచేతుల్లో ఉన్నవాటినన్నా మనం సక్రమంగా, చాలా ఖచ్చితంగా ఇంప్లిమెంట్ చేయాల్సిన అవసరముంది. ఈ ఉద్దేశంతోనే ఈప్రశ్నను అడగడం జరిగింది. ఈరోజు మంత్రిగారు మాట్లాడుతూ, నకిలీ విత్తనాల విషయమై దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ దాడులు కూడా పలు శాఖలు.... మెట్రాలజీ, విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎ.పి.సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మొదలగు శాఖలతోపాటు ఇన్‌బిల్ట్ డిపార్టుమెంట్ కూడా ఈదాడులను నిర్వహిస్తుంది. అయినప్పటికీ, ఈ కేసులన్నీ చాలావరకు నీరుగారిపోతున్నాయి. కోర్టుల ముందు వీగిపోతున్నాయి. దానికి కారణం టెక్నికల్ లాప్సెస్. 90-95 శాతం కేసుల్లో ఈ టెక్నికల్ లాప్సెస్ కారణంగా, నకిలీ విత్తనాలు/ఎరువుల వ్యాపారులు రూ.10,000/- లేదా రూ.25,000/- పెనాల్టీతో తప్పించుకుంటున్నారు. ఇలాంటివి అరికట్టడంలో రైతాంగానికి ఒక స్పష్టమైన హామీ ఇవ్వాల్సిన అవసరముంది.

గౌరవ మంత్రిగారు చెప్పినట్లు మెయిజ్, బాజ్రా, సన్‌ఫ్లవర్ సీడ్స్‌లో... ముఖ్యంగా కాటన్ సీడ్స్‌లో వేరియస్ వెరైటీస్ ఆఫ్ స్పూరియస్ సీడ్స్ వస్తున్నాయి. వీటిని అమ్మడానికి గుంటూరులో ఆటోనగర్, దుర్గి, రెంటచింతల, మేడికొండూరు, సిరిపురంలలో, కోస్తాంధ్రాలోని రైతులను టార్గెట్‌గా చేసుకుంటున్నారు. అదేవిధంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, నర్సీపట్నం, దొండపర్తి... మరికొన్నిచోట్ల అధికారులు/కమీషనర్స్.... కర్నూల్, అనంతపూర్, ముఖ్యంగా వెస్టర్న్ ప్రకాశం జిల్లా... these are potential hubs for selling all these fake seeds. ఈ స్పిన్నింగ్ మిల్స్, జిన్నింగ్ మిల్స్ నుండి కాటన్‌సీడ్స్ తీసుకువచ్చి, ఖాళీ సంచుల్లో.... మంత్రిగారు చెప్పినట్లు రాశిసీడ్స్, నూజివీడుసీడ్స్, బయోసీడ్స్ వంటి రిప్యూటెడ్ కంపెనీలపై కూడా దాడులు జరిగాయి. కేసులు బుక్‌చేయడం జరిగింది. మా ప్రశ్న కూడా అదే. అసలు తప్పు ఎక్కడ జరుగుతోంది? ఎక్కడ మనం విఫలమౌతున్నామో ఆలోచించాలి.

మంత్రిగారు మేమడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ 'truthful labeling is the responsibility of the company ' అని అన్నారు. సీడ్స్ ప్రొడక్షన్ స్టేజ్‌లోనే మానిటరింగ్, విజిలెన్స్ విషయంలో మనం విఫలం అవుతున్నాం. అందువల్ల, రిజెక్టెడ్ సీడ్స్ బయటకు వచ్చి కల్తీ ద్వారా, కొన్నిచోట్ల నకిలీ ద్వారా రైతాంగానికి చేరి, రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఎకరాకు రూ.15,000/- నుండి రూ.20,000/-ఖర్చు పెడుతున్నారు. అవి కల్తీ/నకిలీ విత్తనాలనే విషయం జర్మినేషన్ సమయంలో తెలియడంలేదు. ఫ్లవరింగ్ సమయంలో తెలిసి, దిగులు పడి, ప్రత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సంగతి కూడా ఈ సందర్భంగా మీ ద్వారా మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను. రైతులకు ప్రభుత్వంపై నమ్మకం కల్గించేందుకు ప్రభుత్వం

ఒక ప్రాధాన్యతా క్రమంలో తగువిధమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. అంటే సీడ్ టెస్టింగ్ ల్యాబ్స్ సరిగ్గా ఉన్నాయా? లేవా? సీడ్ టెస్టింగ్ ల్యాబ్స్‌లో ఎక్విప్‌మెంట్ సరిగ్గా ఉందా? లేదా? రాష్ట్ర విభజన తరువాత మన రాష్ట్రానికి ఎన్ని సీడ్ టెస్టింగ్ ల్యాబ్స్ వచ్చాయనే విషయమై గౌరవ మంత్రిగారు వివరించాల్సిన అవసరముంది. ఎందుకంటే, సీడ్ టెస్టింగ్ ల్యాబ్స్ అన్నీ హైదరాబాద్‌లోనే ఉన్నాయి. Sampling విషయంలో ప్రధానంగా కర్నూల్ జిల్లాలోని ఎమ్మిగనూరు సీడ్‌ల్యాబ్‌కు పంపిస్తున్నారు, అదేవిధంగా తాడేపల్లిగూడెం పంపిస్తున్నారు. వాళ్ళు మూడు శాంపిల్స్ తీసుకుంటారు. ఒకటేమో డిపార్టుమెంట్ దగ్గర, మరొకటి డిస్ట్రిబూటర్ దగ్గర పెట్టుకుని, ఇంకొకటి టెస్టింగ్‌కు పంపిస్తారు. ఈ సీడ్ టెస్టింగ్‌కు ఎంత సమయం తీసుకుంటున్నారు? గౌరవ మంత్రిగారు వీటన్నింటిపైన స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరముంది.

...

నకిలీ విత్తనాల బారి నుంచి కొత్త ప్రభుత్వం ఏ విధంగా కాపాడుతుందని రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ శాసనసభ ద్వారా వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కొత్త రాష్ట్రంలో కొత్తగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని మనం ఏర్పాటు చేసుకుంటున్నాం. అందులో సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకుంటున్నామా, లేదా అనే విషయాలు స్పష్టంగా తెలియజేయాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట): అధ్యక్షా, గౌరవ సభ్యులు సురేష్ గారు అడిగిన ప్రశ్నలకు, రాష్ట్ర విభజన తరువాత సీడ్ టెస్టింగ్ ల్యాబ్స్ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడంలో ఉన్నాయి. గుంటూరులోనే హబ్ కేంద్రంగా నకిలీ విత్తనాల రాకెట్ జరుగుతుందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఎమ్మార్పీ ధరలకన్నా ఎక్కువగా అమ్ముతున్నట్లు, నాసిరకం, నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చిన వెంటనే వాటిపై వ్యవసాయశాఖలోని నిఘా విభాగం కఠినంగా వ్యవహరించి దాడులు చేయడం, సీజ్ చేయడం జరిగింది. అటువంటి వాటిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరిగింది. కోర్టు జోక్యం ఉంటే తప్ప వాటిపై ప్రభుత్వం ఉపేక్షించలేదు. రైతులకు అన్యాయం చేసిన ఏ కంపెనీపైన అయినా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నది. విత్తన చట్టాన్ని, ఎరువులు, పురుగుమందుల చట్టాన్ని సవరించి శిక్షలను కఠినతరం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. విత్తనాలు, పురుగుమందులు ఎమ్మార్పీకి మించి అమ్మినా, నాసిరకం విత్తనాలు అమ్మినా ప్రభుత్వం ఎవరినీ ఉపేక్షించేది లేదు. ప్రభుత్వం అందుకోసం టోల్‌ఫ్రీ నంబరును కూడా ఇచ్చింది. ఈ నంబర్ ద్వారా వచ్చిన సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకొని దాడులు చేసి, ఎక్కడైనా నాసిరకం, నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే వారిపై దాడులు చేసి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. చట్టాలను కఠినతరం చేయడానికి ఏవైనా సలహాలు, సూచనలు ఉంటే ఇవాల్సిందిగా కోరుతున్నాను.

డా. ఏ.సురేష్ (సంతనూతలపాడు)ః అధ్యక్షా, నాసిరకం, నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. కొన్ని కంపెనీలు నేరుగా రైతులకు డోర్ డెలివరీ చేస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతం నంద్యాల, చుట్టుప్రక్కల గ్రామాలలో ఈ వ్యాపారం జోరుగా సాగుతుంది. వీటివల్ల రైతులు మోసపోతున్నారు. రైతులకు అవగాహన పెంచేందుకు కార్యక్రమాలు చేయాలి. ఇంతకు ముందు ప్రభుత్వాలు, ఇప్పుడున్న ప్రభుత్వం రైతుల కోసం 'పొలం బడి', 'పొలం పిలుస్తుంది' లాంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు, చేపడుతున్నాయి. అవన్నీ తూతూ మంత్రంగా సాగాయి తప్ప, వాటి వల్ల రైతుకు ప్రయోజనం కలగలేదు. ఈ విషయాన్ని మీ ద్వారా సభ దృష్టికి తీసుకువస్తున్నాను.

(అధికారపార్టీ సభ్యులు అభ్యంతాలు తెలియజేసారు)

కల్తీ విత్తనాల వల్ల రైతాంగం ఎలా నష్టపోతుందో తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కల్తీ విత్తనాలు, నకిలీ విత్తనాల వల్ల రైతులు ఏ విధంగా నష్టపోతున్నారో, ఏ విధంగా రైతుల ఆత్మహత్యలకు దారితీస్తున్నాయో అనే విషయంపై రైతులకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వం రైతులకు అండగా ఉండాల్సిన బాధ్యత ఉంది. మొట్టమొదటి సమస్యగా రైతుల సమస్యలను చర్చించుకుంటున్నాం కనుక, ఒక అర్థవంతమైన చర్చ జరిగిందని నేను భావిస్తున్నాను. దీనిపై ప్రభుత్వం స్పందించి, మంత్రి గారు రైతులకు స్పష్టమైన హామీని, భరోసాను ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ (తెనాలి)ః అధ్యక్షా, రాష్ట్ర విభజన తరువాత వ్యవసాయానికి పెద్దపీట వేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను రూపొందించాలనే ఆలోచనలో ఉన్నారు. ఇది చాలా సంతోషకరమైన అంశం. విత్తన చట్టంపై గత ప్రభుత్వాలు ఆలోచనలు చేశాయి. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ చట్టంలో మార్పులు తీసుకొని రావాలని భావించింది. ప్రసిద్ధ కంపెనీలుగా పరిగణించబడుతున్న వాటి ద్వారా రైతులకు నష్టం జరిగితే ఆ బాధ్యతను వారిపై పెట్టి చట్టంలో రైతులకు భద్రత కల్పించే విధంగా చేయాలని గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. రాష్ట్రంలోనున్న 13 జిల్లాలలో రైతు విత్తనం వేసే దగ్గర నుంచి పంట చేతికి అందేవరకు ప్రభుత్వం కొన్ని కార్యక్రమాలు రూపొందించినట్లు తెలుస్తుంది. ప్రతి అంశంలో పారదర్శకంగా ఉండే విధంగా విత్తన సరఫరా సంస్థల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుంది. ఏ సంస్థలైతే నాసిరకం, కల్తీ విత్తనాలు సరఫరా చేశారో వాటిపై నిషేధం, నిర్బంధాలు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటే బాగుంటుందని గౌరవ మంత్రి గారికి మీ ద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి): అధ్యక్షా, నకిలీ విత్తనాల చట్టాన్ని చాలా పకడ్బందీగా చేస్తామంటున్నారు. అది మంచిమాటే. నకిలీ విత్తనాలు మార్కెట్‌లో రాకుండా ఉండడం కోసం ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటుందో తెలపండి. నకిలీ విత్తనాల వల్ల చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. స్వాతంత్రం వచ్చి 65 సంవత్సరాలు అయినా కూడా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటే మనందరం సిగ్గుపడాలి. రైతుల ఆత్మహత్యలు నివారించడం కోసం, నకిలీ విత్తనాలు రాష్ట్రంలో ఎక్కడా దొరకకుండా ఉండడానికి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని కోరుతున్నాను.

శ్రీ కొమ్మలపాటి శ్రీధర్ (పెదకూరపాడు): అధ్యక్షా, ప్రభుత్వం ఏర్పడి రెండు మాసాలు అయినది. గత శాసనసభలో కూడా నేను సభ్యునిగా ఉన్నాను. గతంలో రైతాంగ సమస్యల మీద మీటింగులలో వ్యవసాయ అధికారులతో మాట్లాడినపుడు, ఎక్కువగా 'ఆదర్శరైతు'పై ఆధారపడకుండా నకిలీ విత్తనాలను నియంత్రించాలని నేను ప్రశ్నించినపుడు, మీ రైతులే చెబుతున్నారని రైతులమీద అధికారులు ఆధారపడిన సందర్భాలున్నాయి. ఈ రెండు మాసాలలో ముఖ్యంగా గమనించింది ఏమంటే పూర్తిస్థాయిలో వ్యవసాయదారులకు ఉపయోగపడాలని, 'ఆదర్శరైతు' పథకాన్ని రద్దు చేసి, అధికారులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ ఇచ్చి, నకిలీ విత్తనాలపై దాడులు చేయించడం జరుగుతుందని నేను నమ్ముతున్నాను. మా ప్రాంతంలో పత్తి, మిర్చి నారుమడులు వేశారు. రాబోయే రోజులలో చిన్న పొరపాటు కూడా జరగకుండా రైతులకు ఉపయోగపడేలా, ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు అందేలా, వ్యవసాయం లాభదాయకంగా ఉండాలని ప్రభుత్వం కోరుకుంటున్నట్లుగా మెరుగైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖామాత్యులకు తెలియజేస్తున్నాను.

...

శ్రీ ప్రత్తిపాటి పుల్లా రావు (చిలకలూరిపేట): అధ్యక్షా, గౌరవ సభ్యులు సురేశ్ గారు 'పొలం పిలుస్తోంది, రా' కార్యక్రమం గురించి, రైతులకు కల్పించవలసిన అవగాహనా కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. ప్రత్యేకంగా ఈ సంవత్సరం డిఎన్ఎ సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. రైతులకు అవగాహన కల్పించటం కొరకు 'పొలం పిలుస్తోంది, రా' అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించటం జరుగుతున్నది. ప్రియతమ ముఖ్యమంత్రి గారు ఈ పొలం పిలుస్తోంది రా అనే కార్యక్రమంతో పాటు, రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటం కోసం అనేక కొత్త విధానాలను, కార్యక్రమాలను తీసుకురావటం జరిగింది. ఈ కార్యక్రమాల కింద సాయిల్ టెస్ట్ ల్యాబ్స్ ఏర్పాటు కాని, హెల్త్ కార్డ్స్ జారీ చేయడం కాని జరుగుతుంది. మైక్రో న్యూట్రియంట్స్ డెఫిషియన్సీ వుంటే ప్రభుత్వమే సబ్సిడీ మీద పొటాషియం, బోరాన్ కూడా సప్లై చేయాలన్న ఆలోచన వున్నది. అందువల్ల ఈనాడు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పొలంపిలుస్తోంది, రా' అన్న కార్యక్రమం తూతూ మంత్ర కార్యక్రమం కాదు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చాలా సీరియస్‌గా తీసుకొని ప్రజా

ప్రతినిధుల్ని, అధికారుల్ని సైంటిస్టుల్ని అందరినీ భాగస్వాముల్ని చేయడం జరుగుతోంది. రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వాళ్లకు స్కిల్ డెవలప్‌మెంట్ కల్పించటం మరియు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ఈ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. కనుకనే ఈనాడు రైతుకు వ్యవసాయంతో పాటు అలైడ్ సెక్టార్స్ పట్ల కూడా దృష్టి మరల్చాలన్నది ఈ ప్రభుత్వ లక్ష్యం. అందుకనే ఏ పంట సాగు చేస్తే లాభం వస్తుంది, ఏ విధానంలో సాగు చేస్తే లాభం వస్తుంది అన్న అంశాలపై కూడా వాళ్లకు అవగాహన కల్పించడం కోసం ప్రతి మంగళ వారం మన ప్రియతమ ముఖ్యమంత్రి గారు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకొని పాల్గొనడం జరుగుతున్నది. కనుకనే ఈ ప్రభుత్వం ఏ కార్యక్రమం తీసుకున్నా, ఏ నిర్ణయం తీసుకున్నా రైతులకు అనుగుణంగా, రైతుల పక్షపాతిగా ప్రతిష్మాత్మకంగా తీసుకొని నిర్వహించడం జరుగుతున్నది. రైతుకు వ్యవసాయాన్ని పండుగ చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. కనుక సురేశ్ గారు చెప్పినట్లు రైతులకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహించడం తోపాటు నకిలీ విత్తనాల నియంత్రించడం కోసం కూడా సీడ్ విలేజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను కూడా ఈ ప్రభుత్వం అమలుచేయడం జరుగుతుందని తెలియజేస్తున్నాను. గౌ.ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గారు కూడా సిక్స్-ఎ చట్టం, ఇంకా ఇతర చట్టాలను కూడా సవరించి రైతులకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పడం జరిగింది. ఆ దిశలో కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తూ వుంది. తప్పకుండా భవిషత్తులో నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవడం పై దృష్టి సారిస్తుంది.

గౌ.సభ్యులు రవికుమార్ గారు నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందని అడిగారు. నకిలి విత్తనాల నియంత్రణ కోసం ప్రభుత్వం తప్పకుండా ప్రాసెసింగ్ యూనిట్స్ నుంచే దాడులు ప్రారంభించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడంతో పాటు వాటిని అణచివేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది. కొమ్మలపాటి శ్రీధర్ గారు ఆదర్శ రైతుల పేరుతో నకిలీ విత్తనాలు, సబ్ స్టాండర్డ్ విత్తనాల సరఫరా జరుగుతుందని, దానిని నియంత్రించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనుభవం లేని వారిని ఆదర్శ రైతుల పేరు మీద నియామకం చేసిన విషయం ప్రభుత్వం దృష్టికొచ్చింది. అలాంటి వారినందరినీ వెరిఫై చేసి తప్పకుండా అనుభవం లేని ఆదర్శ రైతులను తొలగించి కేవలం అర్హత, అనుభవం వున్న వారిని మాత్రమే ఆదర్శ రైతులుగా కొనసాగించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది. తద్వారా నకిలీ విత్తనాల, ఎరువుల సరఫరాను నియంత్రిస్తుంది. అలాంటి సంఘటనలు ప్రభుత్వ దృష్టికి వస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

**MR.SPEAKER: Question No.9 (12) is postponed at the request of the Member.**

శ్రీ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు (బొబ్బిలి)ః సార్ ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనది. దానిపైన తప్పకుండా చర్చ జరగాల్సిన అవసరమున్నది.

మిస్టర్ స్పీకర్ః ఆ ప్రశ్న సభ్యుని కోరిక మేరకు పోస్ట్‌పోన్ చేయబడింది. అవసరమైతే It will be re-posted**.** You come in the proper form.

**Now let us take up Question No.22 (13) Minister for Endowments.**

**ప్రశ్న నెంబరు. 22 (13)**

**శ్రీ రాజన్న దొర పీడిక (సాలూరు), ఎమ్ఎల్ఏ**

**గౌరవనీయులైన దేవాదాయశాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాః**

అ. తిరుమల తిరుపతి దేవస్థానంలో బదిలీలపై నియామకం ద్వారా దళిత, గిరిజన ఉద్యోగుల పదోన్నతి కోసం 1976లో జీవో నెంబర్ 78లో ఉత్తర్వులు జారీ చేసిన విషయం వాస్తవమేనా?

ఆ. జీవోనెంబరు 758పై 23.4.2008 తేదీ గల ప్రభుత్వ లేఖను పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం 2.11.2010 తేదీన 205 తీర్మానాన్ని జారీ చేసిన విషయం కూడా వాస్తవమేనా?

ఇ. అయితే సదరు జీవోలను, తీర్మానాన్ని అమలుపరచలేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

ఈ. అయితే, జీవోలను, తీర్మానాన్ని సమర్థంగా అమలుపరచడం కోసం తీసుకున్న చర్య, తీసుకోబోయే చర్యలేమిటి?

**టశ్రీ పి.మాణిక్యాల రావు (దేవాదాయ శాఖ మంత్రి), (తాడేపల్లిగూడెం)ః**

అ. లేదండీ.

ఆ. అవునండీ.

ఇ. అవునండీ.

ఈ అవునండీ. TTD is taking action as per the clarification given by the Social Welfare Department recently.

శ్రీ పీడిక రాజన్న దొర (సాలూరు): అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు మొదటి ప్రశ్నకు లేదని చెప్పారు. ప్రింటింగ్ మిస్టేక్ వల్ల జీవో నెంబర్ 78 అని పడింది. కాని అది నిజంగా 78 కాదు. 758. జీవో నెంబర్ పొరపాటు వల్ల మంత్రి గారు లేదని చెప్పారేమో ! రెండవ ప్రశ్నకు అవునని చెప్పారు. చాలా సంతోషం. ఇది దళిత, గిరిజనులకు సంబంధించిన చాలా ముఖ్యమైన అంశం. ఏడుకొండల వెంకన్న సాక్షిగా ఆయన దేవస్థానంలోనే దళిత, గిరిజన ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని తమ దృష్టికి, సభ దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకురావలసిన ముఖ్యమైన అంశం ఇది.

1976 లో ఆ జీవో జారీ చేయడం జరిగింది. రెండు జి.వోలను ప్రభుత్వం జారీ చేసి దాదాపు 40 సంవత్సరాలు గడుస్తున్నా ఆ జీవోలను అమలు చేయడం లేదు. కనీసం ఇప్పుడైనా న్యాయం జరుగుతుందేమోనని మీ దృష్టికి కూడా తీసుకువస్తున్నాను. నేను ఎస్టీ కమిటీ చైర్మన్‌గా 2012 వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో సమీక్షించినప్పుడు అక్కడి దళిత, గిరిజన ఉద్యోగ సంఘాల వారు ఏకగ్రీవంగా చెప్పిందేమిటంటే న్యాయం చేయలేనటువంటి సమీక్షలు, సమావేశాలు వృధా అని, ప్రోటోకాల్ ప్రకారం సమావేశాన్ని నిర్వహించుకుని వెళ్లాలనుకుంటే వెళ్లండని, ఇంతవరకు సమీక్షలు జరిపిన కమిటీలు ప్రభుత్వ జీవోలను అమలు చేసే విషయంలో నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం జరుగుతోందని, దళిత సంఘాలు సుమారు మూడు గంటల పాటు కమిటీ సమావేశాన్ని ప్రతిఘటించడం జరిగింది. చాలా దుర్భరమైన పరిస్థితులను రాష్ట్ర హరిజన గిరిజన వర్గాలు ఎదుర్కొంటున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం నందు దాదాపు 25 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ విధానాన్ని పాటించకపోవడంతో క్రింది స్థాయి దళిత, గిరిజన ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోంది.

అధ్యక్షా, ఈ సమస్య 1976 వ సంవత్సరం నుంచి నలుగుతోంది. తమరు కూడా ఒకసారి ఆలోచన చేయండి. ఆ తరువాత కూడా ప్రభుత్వాలు చాలా జి.వో.లను జారీ చేయడం జరిగింది. 2003 వ సంవత్సరంలో జి.వొ.నెంబర్ 86 ను ప్రభుత్వం జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన జి.వొ.లను అమలుచేసినట్లైతేనే దళిత, గిరిజన న్యాయం చేకూరే అవకాశం ఉంటుంది.

అధ్యక్షా, 2010 వ సంవత్సరంలో కూడా తిరుమల తిరుపతి దేవస్థానంలో కీలక పోస్ట్‌లో విధులు నిర్వర్తించే అధికారి ఆధ్వర్యంలో ఒక తీర్మానం కూడా చేయడం జరిగింది. ఆనాడు తిరుమల తిరుపతి దేవస్థానానికి స్పెసిఫైడ్ అథారిటీకి శ్రీ జె.సత్యనారాయణ గారు చైర్మన్‌గా ఉండేవారు. అలాగే ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారైన శ్రీ ఐ.వై.ఆర్. కృష్ణారావు గారు ఆనాడు తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించేవారు. అలాగే ఉద్దండుడైన శ్రీ వి.నాగిరెడ్డి గారు రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీగా విధులు నిర్వర్తించేవారు. ఆనాడు తిరుమల తిరుపతి దేవస్థాన స్పెసిఫైడ్ అథారిటీలో సభ్యులుగా ఉండే వారు. కానీ 205 వ నెంబర్ తీర్మానాన్ని కూడా తిరుమల తిరుపతి దేవస్థానం అమలుచేయకపోవడం చాలా బాధాకరం.

...

అందులో మొత్తం 53 కేటగిరీలున్నాయి. అందులో ప్రధానంగా 16 కేటగిరీలను తీసుకుంటామని అన్నారు. ఆ 16 కేటగిరీలను కూడా ఇంతవరకు కన్సిడర్ చేయలేదు. ఆ 16 కేటగిరీలు కూడా చాలా చిన్న చిన్న ఉద్యోగాలు. వాటిలో చాలా ఖాళీలున్నా ఈ రోజు వరకు అమలుచేయకపోవడం చాలా బాధాకరం. ఇదే అంశాన్ని ఆనాటి సభాపతి అనుమతితో 24.08.2012న శాసనసభ ఆవరణలో జరిగిన కమిటీలో ప్రత్యేకంగా ప్రస్తావించాం. ఆ సమావేశానికి దేవాదాయ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శులతోబాటు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కూడా హాజరయ్యారు. అప్పుడు అధికారులంతా హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి ఇప్పటికి రెండు సంవత్సరాలు పూర్తయింది. ఇప్పటికి రెండు సంవత్సరాలు పూర్తయినా కూడా ఇంకా క్లారిఫికేషన్స్ అంటున్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లి అక్కడ ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ ఖాళీలను రిక్రూట్ చేయండని, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పాటించాలని దేవస్థానాన్ని కోరడంతోబాటు ప్రభుత్వానికి కూడా లేఖ రాశారు. దానిపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదు.

ప్రభుత్వం హరిజన, గిరిజనుల కోసం ప్రత్యేకంగా సబ్-ప్లాన్‌ను రూపొందించి వారిని ఉద్ధరిస్తామని చెబుతున్నది. కానీ హరిజనులు, గిరిజనులకు ప్రభుత్వమే అన్యాయం చేస్తే ఎలా? ప్రభుత్వం పెద్ద మనసుతో, మానవత్వంతో ఆలోచించాలి. చిన్న ఉద్యోగులకు అన్యాయం జరిగితే పెద్ద అధికారులకు మొరపెట్టుకుంటారు, పెద్ద అధికారులే అన్యాయం చేస్తుంటే ప్రభుత్వాన్ని, మంత్రుల్ని అడుగుతాం. మంత్రులు, ప్రభుత్వం, శాసనసభ ద్వారా న్యాయం జరగకపోతే, సాక్షాత్తూ తిరుమల వెంకన్న సన్నిధిలోనే అన్యాయం జరుగుతుంటే గిరిజనులు అభివృద్ధిలోకి ఎలా వస్తారు? వారు ప్రమోషన్లు పొందేది ఎపుడు? రిక్రూట్‌మెంట్ జరిగేదెపుడు, బ్యాక్‌లాగ్ ఖాళీలు భర్తీ చేసేదెపుడు? ప్రభుత్వం ఈ విషయంలో పెద్ద మనసుతో ఆలోచించాలి. ఇది ఒకటి రెండు రోజుల సమస్య కాదు. మీరు అంగీకరించిన, కమిటీ రికమెండ్ చేసిన ఆ 16 కేటగిరీలను ముందుగా భర్తీ చేయండి. స్పెసిఫైడ్ అథారిటీ కూడా ఆ విషయం చెప్పింది. They told that

they will consider the issue immediately and all eligible candidates should submit their applications and options. But no action has so far been initiated for necessary recruitment. ఇంత జరుగుతున్నా కూడా ప్రభుత్వం స్పందించకపోతే ఎలా? ముందుగా 16 కేటగిరీలను ముందుగా భర్తీ చేయండి. ఆ తరవాత మిగతా కేటగిరీలను పరిశీలించవచ్చు. అదే విధంగా టీచర్ పోస్టులు, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు చాలా ఖాళీగా ఉన్నాయి. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడైనా గౌరవమంత్రి గారికి ఒకటే మనవి చేస్తున్నాను. ఈ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోబోతున్నారో స్పష్టంగా చెప్పాలి. అదే విధంగా సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు చెప్పినట్లుగా రిటైరైన పోస్టులను, చనిపోయిన ఉద్యోగుల ఖాళీలను ఎస్సీ, ఎస్టీలతో భర్తీ చేయాలి. ఆ ఖాళీలను ఎప్పటిలోగా, ఏ విధంగా భర్తీ చేస్తారు? ఏ విధంగా న్యాయం చేస్తారో మంత్రి గారు సమాధానం చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ పి.మాణిక్యాల రావు(తాడేపల్లిగూడెం) : అధ్యక్షా, గౌరవసభ్యులు ఇచ్చిన నోటీసులో జీవో నం.78 గురించి ప్రస్తావించారు. జీవో నం.758 తేది.30.10.1976 నియామకాలు, ప్రమోషన్లకు సంబంధించినది కాదు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ఏ రకమైన అన్యాయం జరగలేదు. రిజర్వేషన్లను తిరుమల తిరుపతి దేవస్థానం అమలుచేస్తున్నది.

శ్రీ పి.రాజన్నదొర (సాలూరు): అధ్యక్షా, అన్యాయం జరిగిందని నేను చెప్పడం కాదు. స్వయంగా ప్రభుత్వాధికారులు పరిశీలించి ప్రభుత్వానికి తెలియజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ 2012లో ఏయే కేటగిరీలలో ఏ విధంగా అన్యాయం జరిగిందో స్పష్టంగా తెలియజేస్తూ, చర్యలు తీసుకోమని ప్రభుత్వానికి లేఖ రాశారు. దేవాదాయ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శులతోబాటు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను కమిటీలో నియమించి తదుపరి చర్యలు తీసుకోమని చెప్పారు. ఆవిధంగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు తీసుకున్నారో లేదో తెలియదు. చనిపోయినవారి ద్వారా ఏర్పడిన ఖాళీలు, బ్యాక్‌లాగ్ పోస్టులను ఎస్సీలకు జీవో నం.5, 21, 2 ప్రకారం ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు ఏడు శాతం రావాలి. దీనిని పూర్తిగా అధ్యయనం చేయాలంటే ముగ్గురు సీనియర్ అధికారులు రూల్ ఆఫ్ రిజర్వేషన్ల విషయంలో అనుభవమున్నవారు కావాలని డిప్యూటీ డైరెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ విషయంలో మేం 24.08.2012న మూడు శాఖల ముఖ్య కార్యదర్శులతోబాటు తిరుమల తిరుపతి దేవస్థానం జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో సమావేశమైనపుడు ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగింది కాబట్టి న్యాయం చేస్తామని చెప్పారు. ఆ విధంగా చెప్పిన ఇప్పటికి రెండు సంవత్సరాలైనా కూడా న్యాయం జరగలేదు. కానీ మంత్రి గారు ఎవరికీ అన్యాయం జరగలేదని చెబుతున్నారు. ఈ సమాచారం మేమిచ్చినది కాదు. స్పెసిఫైడ్ అథారిటీ అయిన తిరుమల తిరుపతి దేవస్థానం జారీ చేసిన ఉత్తర్వులు. అర్హులై, విద్యార్హతలు ఉండి దరఖాస్తులు పెట్టుకొన్నవారిని రిక్రూట్‌మెంట్ బై

ట్రాన్స్‌ఫర్ తీసుకోమని కోరాం. కానీ మంత్రిగారు సమాధానమిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పర్‌ఫెక్ట్‌గా జరుగుతున్నాయని చెప్పడం బాధగా ఉంది. నేను గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పియుసి కమిటీలో సభ్యునిగా, ఎస్టీ కమిటీ చైర్మన్‌గా తిరుమల తిరుపతి దేవస్థానం విషయంలో రెవ్యూకి వెళ్లాను. బ్యాక్‌లాగ్ పోస్టులతోబాటు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో రిజర్వేషన్లు అమలుచేస్తామని మంత్రిగారు హామీ ఇస్తే సంతోషిస్తాను.

శ్రీ చెవిరెడ్డి భాస్కరరెడ్డి(చంద్రగిరి)ః అధ్యక్షా, మంత్రిగారు సమాధానమిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంలో రిజర్వేషన్లతోబాటు మిగతా విషయాలలో కూడా ఎటువంటి అక్రమాలు జరగలేదని, సక్రమంగా జరిగాయని పేర్కొన్నారు. ఒక చిన్న ఉదాహరణ చెబుతూ దానికి మంత్రిగారు సమాధానం చెప్పాలని అడుగుతున్నాను. నేను కూడా తిరుమల తిరుపతి దేవస్థానం విద్యాసంస్థలలో చదువుకొన్నవాడిని. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సుమారు 10 కాలేజీలున్నాయి, కొన్ని వేల కాలేజీ, హాస్టల్ సీట్లున్నాయి. వాటిలో పది నుంచి ఇరవై శాతం సీట్లను టిటిడి యాజమాన్యం తమ కోటాగా పెట్టుకొన్నది. హాస్టల్ సీట్ల విషయంలో కూడా టిటిడి యాజమాన్యం రిజర్వేషన్లు పాటించడం లేదు. బీఎస్సీ కంప్యూటర్స్‌లో 82శాతం మార్కులు వచ్చిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు హాస్టల్‌లో సీటు ఇవ్వడం లేదు, కానీ 52 శాతం మంది ఓ.సి. విద్యార్థులకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిఫార్సు చేస్తే సీట్లు ఇస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లోని హాస్టల్స్‌లో అటువంటి ఇబ్బందులు లేవు. టిటిడి కళాశాలలు, హాస్టల్స్‌లో సీట్లను వారి ఇష్ట ప్రకారం ఇస్తున్నారు. టిటిడి కళాశాలల్లో, హాస్టల్స్‌లో ఫీజులు చాలా తక్కువ. అటువంటి సౌకర్యం రాష్ట్రంలో ఎక్కడా ఉండదు. టిటిడి విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పాటించడం లేదు.

మిస్టర్ స్పీకర్ః భాస్కరరెడ్డి గారూ, మీరు ప్రస్తావిస్తున్న అంశం ప్రశ్నకు సంబంధించినదై ఉండాలి. ప్రశ్నకు డీవియేట్ అయి మాట్లాడవద్దు. Confine yourself to the question.

శ్రీ చెవిరెడ్డి భాస్కరరెడ్డి (చంద్రగిరి)ః అధ్యక్షా, టిటిడి విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు అమలుకావడం లేదని నేను వాస్తవాలు చెప్పాను. రిజర్వేషన్లు సక్రమంగా అమలవుతున్నాయని మంత్రి గారు చెప్పారు కాబట్టి వారి సమాధానంలో వారు చెప్పవచ్చు.

...

శ్రీ యనమల రామకృష్ణుడుః అధ్యక్షా, బిఏసిలో నిర్ణయించిన ప్రకారంగా ఒక గంట ప్రశ్నోత్తరాల సమయం ఉంటుంది. సభ మొదలై దాదాపు గంట కావస్తోంది, ఇప్పటికి ఇంకా రెండవ ప్రశ్న కూడా పూర్తి కాలేదు. అందువలన అన్ని ప్రశ్నలకు సమానంగా సమయాన్ని కేటాయిస్తే సభ్యులందరూ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి అవకాశం ఉంటుంది.

శ్రీ పి.మాణిక్యాలరావు (తాడేపల్లిగూడెం): సభ్యులు అడిగిన విషయం జీఓ నెం.758 పరిధిలోకి రాదు. రిజల్యూషన్ నెం.205, తేది 02.11.2010ని ఏ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రాతినిధ్యం లేదో ఆయా ఉద్యోగులకు ప్రాతినిథ్యం కల్పించడం కోసం చేశారు. రిక్రూట్‌మెంటు, పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వ ఆదేశాలను తిరుమల, తిరుపతి దేవస్థానం వారు ఖచ్చితంగా అమలు చేస్తున్నారు. ఎలాంటి ఉల్లంఘన జరగలేదు. తిరుమల, తిరుపతి దేవస్థానంలో ఎలాంటి అన్యాయం జరగలేదు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను సక్రమంగా పాటించడం జరుగుతోంది. మిత్రులు ఏదైతే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పాటించాలని చెప్పారో ఆ విషయంలో ఈ ప్రభుత్వం నిబద్ధతతో వుంది. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన విషయంలో ఖచ్చితంగా వారికున్న అవకాశాలు వారికి వుండాలని నిబద్ధతతో ఈ ప్రభుత్వం ఉన్నది. ఇప్పటికే తిరుమల, తిరుపతి దేవస్థానంలో పోస్టింగుల విషయంలో పూర్తిగా రిజర్వేషన్‌కు సంబంధించి జీఓ నెం.5 ప్రకారం చేయడం జరిగింది. జీఓ నెం.5 లో వున్న ఎస్సీ రిజర్వేషన్ 16%, ఎస్టీ రిజర్వేషన్ 6% మేరకు టిటిడిలో భర్తీ చేయడం జరిగింది.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి(పులివెందుల): అధ్యక్షా, గౌరవ శాసన సభ్యులు రాజన్నదొర గారు మూడు సార్లు శాసన సభకు ఎన్నికయ్యారు. ఆయన డిపార్ట్‌మెంటు లెక్కలను ఆధారంగా చూపిస్తూ మాట్లాడుతున్నారు. అక్కడ ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఒక కమిటీ వేసి ఆయన చెప్పిన మాటలను కమిటీకి రిఫర్ చేసి, వాస్తవాలు ఉంటే సరిదిద్దుతామనే సమాధానం కూడా కనీసం గౌరవ మంత్రి గారు ఇవ్వకపోతే, మా గోడు ఎవరికి చెప్పుకోవాలి. దయచేసి కమిటీ వేసి తప్పులు సరిదిద్దుతామని మంత్రి గారు చెబితే బాగుంటుందని మీద్వారా కోరుతున్నాను.

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, మంత్రి గారు సఫిషియంట్‌గానే సమాధానం చెప్పారు. తొందరలోనే ఎస్సీ వెల్ఫేర్ కమిటీ అసెంబ్లీలో ఏర్పడుతుంది కాబట్టి గౌరవ ప్రతిపక్ష నాయకులు అడిగినట్లుగా ఆ విషయాన్ని ఆ కమిటీకి రిఫర్ చేస్తాము.

(ప్రతిపక్ష సభ్యులు శ్రీ పీడిక రాజన్నదొరచే అంతరాయం)

MR.SPEAKER: Rajannadora garu, you have taken enough time.

**Now, Question No.45 (14) is postponed at the request of the Member.**

**Now let us take up question No.136 (15), Yes, Minister for Medical and Health.**

**ప్రశ్న నెం.136(15)**

**సర్వశ్రీ జ్యోతుల నెహ్రు, చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఎస్.అమరనాథరెడ్డి, గడికోట శ్రీకాంత్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నారాయణ స్వామి – ఎం.ఎల్.ఏ.లు.,**

**గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య, విద్యా శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాః–**

అ) రాష్ట్రంలో 104, 108 సేవలు సక్రమంగా పనిచేయడం లేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా ;

ఆ) 108, 104 సేవలను సమర్ధవంతంగా నడపడానికి ప్రభుత్వం తీసుకొన్న చర్యలేమిటి ;

ఇ) 108, 104 సేవలను పెంచడానికి ప్రభుత్వం వద్ద ప్రతిపాదనేమైనా వున్నదా ;

ఈ) అయితే, వాటి వివరాలేమిటి?

<u>ఆరోగ్య, వైద్య, విద్యా శాఖ మంత్రి (శ్రీ కామినేని శ్రీనివాస్, (కైకలూరు))ః</u>

అ) లేదండీ. ఇది వాస్తవం కాదు.

ఆ) సేవలను మెరుగుపరచడానికి ఈ క్రింది చర్యలను తీసుకోవడమయింది.

1) వాహనాల శ్రేణిని పటిష్టవంతం చేయడం కోసం 145 కొత్త అంబులెన్స్‌లను ఏర్పాటు చేయడమయింది.
2) శిశుపరమైన ఎమర్జెన్సీలను పటిష్టపరచడానికి గాను ఏడు నియోనాటల్ అంబులెన్స్‌లను మంజూరు చేయడమయింది.
3) ఎమర్జెన్సీ నిర్వహణలో వున్న ఎమర్జెన్సీ మేనేజిమెంటు టెక్నీషియన్లకు, పైలెట్లకు కాలానుగుణ శిక్షణనివ్వడం.
4) ప్రగతి సూచికలపై క్రమమైన పర్యవేక్షణ.
5) 108 సర్వీసులపై ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ద్వారా కాలానుగుణ సమీక్ష.
6) 104 సర్వీసుల సీనియర్ ప్రజారోగ్య అధికారుల సునిశిత పర్యవేక్షణ.
7) ఒక్కొక్క ఎంహెచ్‌యుకు నెలకు రూ.17,000/- నుండి

రూ.40,000/-విలువ మేరకు మందులను పెంపుదల చేయడమయింది.

ఇ) లేదండీ.

ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట): అధ్యక్షా, గౌరవ మంత్రిగారు 'ఎ' ప్రశ్నకు సమాధానం ''వాస్తవం కాదు" అని చెబుతున్నారు. ముఖ్యంగా 104, 108 సర్వీసులు సామాన్యులకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలి, ప్రమాదకర పరిస్థితుల్లో వున్న ప్రజలను ఆదుకోవడానికి ఉపయోగపడాలనే మహదాశయంతో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారు ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారు. ఆయన డాక్టర్‌గా, రోగుల యొక్క సంక్షేమం తెలిసివున్న వ్యక్తిగా, ఒక మంచి కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. ఈనాడు ఒక డాక్టర్‌గా సుదీర్ఘ అనుభవం కలిగిన ఆరోగ్య, వైద్య, విద్యా శాఖామాత్యులు దీనిమీద వాస్తవాలు చెబుతారని ఆశించాను. ఈ ప్రశ్న ప్రజోపయోగకరమైన ప్రశ్న. వాస్తవాలతో నేను వచ్చాను. వాస్తవాలనే మాట్లాడటానికి ప్రయత్నం చేస్తాను. మీరు కూడా వాస్తవాలు తెలియచేయండి.

అధ్యక్షా, 104 సర్వీసుల గురించి గతంలో పత్రికల్లో చాలా కథనాలు వచ్చాయి. 250 వాహనాల్లో వైద్యులు లేరని పత్రికల్లో స్పష్టంగా చెప్పడం జరిగింది. వాస్తవంగా చూస్తే బొబ్బిలి నియోజక వర్గంలో రెండు మండలాల్లో 104 సర్వీసులు లేని పరిస్థితి వుంది. ఇది వాస్తవం కాదా? ముఖ్యంగా, విడిపోయి కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో 900 గ్రామాలకు ఈరోజుకి కూడా 104 సేవలు అందని పరిస్థితి వుంది. ఇది వాస్తవం కాదా? ప్రారంభ దశలోనే 67 జబ్బులకు ప్రధానంగా మందులివ్వాలనే ఆలోచనతో ఆరోజు రాజశేఖర్ రెడ్డిగారు ఒక వైద్యుడిగా 67 రకాల మందులను 104 ద్వారా గ్రామాల్లో వున్నటు వంటి రోగులకు సరఫరా చేయడానికి నిర్ణయం తీసుకుంటే దానిని పెంచడానికి, నూతనంగా వస్తున్న బ్యాక్టీరియాల వలన పెరుగుతున్న అనారోగ్య పరిస్థితులను ఎదుర్కోవడానికి ఇంకా మందులను విరివిగా సరఫరా చేసి హెచ్చు మొత్తంలో పంపిణీ చేయాల్సింది పోయి కేవలం 20 రకాల మందులను మాత్రమే 104 ద్వారా అందుబాటులో వుంచుతున్న విషయం వాస్తవం కాదా? మంత్రి గారు ఈ ప్రశ్న ఉత్పన్నం కాదని చెప్పారు. కానీ నేను చెప్పిన విషయాలు వాస్తవాలు కాదా?

...

ఇకపోతే 108 వాహనాల గురించి మాట్లాడుకోవాల్సివస్తే, గతంలో మనం ప్రవేశపెట్టుకున్నప్పుడు ఎక్కడనుంచైనా కేవలం 5 నుండి 15 నిమిషాల సమయంలో వెంటనే వచ్చే పరిస్థితి ఉండేది. కానీ ఇవాళ ఫోన్ల మీద ఫోన్లు చేసినా సరే సమాచారం అందని పరిస్థితి ఉంది. అంతకన్నా దురదృష్టకరమైన పరిస్థితి ఏమంటే, 108 సర్వీసులకు ఫోన్లు చేసిన వ్యక్తులకు వస్తున్న సమాధానమేమంటే, డీజిల్ లేదండీ, డ్రైవర్ అందుబాటులో లేడండీ, అంటూ ఈ రకమైన సమాధానాలతో ఈనాడు సంతృప్తి పడాల్సిన పరిస్థితి వస్తోంది. ఇక అందులో పని చేసే

ఉద్యోగుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందంటే, వారికి జీతాలను కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో మనం ఉన్నాము. ఎందుకంటే ఇది అతి కీలకమైనది. ప్రభుత్వం సామాన్యుడికి అందుబాటులో ఉంచాల్సిన వైద్యాన్ని, సామాన్యుడికి అందించలేని పరిస్థితుల నుండి, ఒక నూతన ప్రక్రియతో సామాన్యుడి చేరువకు వైద్యాన్ని తీసుకెళ్లాలి, సామాన్యుణ్ని కార్పొరేట్ వైద్యం స్థాయికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో గతంలో ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం నిర్వీర్యమవుతున్న పరిస్థితులను ఒక్కసారి ఈ సభ దృష్టికి తీసుకురావాలనే ఆలోచనతో ఈ ప్రశ్నను ఈరోజు వేయడం జరిగింది. మరి అనుభవజ్ఞులైన డాక్టర్ గారు ఎందుకు ఈ రకమైన సమాధానాన్ని చెప్పారో నాకు అర్థం కావడం లేదు. దయచేసి సామాన్యుడికి వైద్యాన్ని అందించడానికి ఆలోచన చేసి, ఈనాడు మేము ఏదైతే చెప్పడం జరిగిందో, వాస్తవాలను పరిశీలన చేసి ఆ అన్నింటినీ సరిదిద్ది సామాన్యుడికి వైద్య సౌకర్యాలను అందించే అవకాశాన్ని కల్పించమని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

డా. కామినేని శ్రీనివాస్ (కైకలూరు): అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన 104 సర్వీసుల్లో రెండు రకాల సర్వీసులు ఉన్నాయి. ఒకటి కాల్ సెంటరు. పూర్వం సత్యం వారు చేసే వారు, 2011 నుండి ఆరోగ్యశ్రీ అమలవుతుంది. రోజుకు 10 నుండి 12 వేల కాల్స్ వస్తాయి. అది హాస్పటల్స్ గురించి గానీ బ్లడ్ బ్యాంకుల గురించి గానీ లేక హెల్త్ ఎడ్వైజెస్ గురించి గానీ కాల్స్ వస్తాయి. అది ఇప్పుడు ఆరోగ్యశ్రీ నిర్వహిస్తోంది. ఇకపోతే ఫిక్సడ్ డే సర్వీసులు అని, రాష్ట్రం మొత్తంలో ఉన్న 13,600 గ్రామాలకు ప్రతి రోజు ఒక స్థలంలో నెలలో రెండు పీహెచ్‌సీలకు ఒక వెహికల్ చొప్పున 271 వాహనాలకు గానీ 251 వాహనాలు పని చేస్తున్నాయి. వాటిల్లో విజయనగరానికి ఉన్న 17 వాహనాల్లో 14 వాహనాలు ఆన్ రోడ్ పని చేస్తున్నాయి.

ఆ వాహనాల్లో 54 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్టు, ఒక డ్రైవర్ ఉంటారు. ఇక 108 సర్వీసులను చూసినట్లయితే, టైమింగ్స్ విషయంలో ఒక బెంచ్ మార్క్ ఉంది. ఆ బెంచ్ మార్కు ప్రకారం అర్బన్ ఏరియాస్‌లో 20 నిమిషాల్లో రావాలి, మా యావరేజీ 15 నిమిషాల 48 సెకన్లు. అలాగే రూరల్ ఏరియాస్‌లో 25 నిమిషాల్లో రావాలి, మా యావరేజీ 25 నిమిషాల 14 సెకన్లు, ఒక 14 సెకన్లు ఎక్కువ ఉంది. యావరేజ్ టైమ్ ట్రైబల్ ఏరియాస్‌లో 35 నిమిషాలు పెడితే ఇప్పుడు 28 నిమిషాల 52 సెకన్లు పడుతుంది. ఏలా ఈ వాహనాలు పని చేస్తున్నాయనే దానికి ఇవన్నీ ఇండికేటర్స్. తప్పకుండా ఈ సర్వీసులను గౌరవ సభ్యుల సూచనల ప్రకారం మెరుగుపరచడానికి తప్పకుండా చర్యలు తీసుకుంటాము.

శ్రీ జ్యోతుల నెహ్రూ(జగ్గంపేట): అధ్యక్షా, గౌరవ మంత్రి గారు చెప్పిన సమాచారంలో 54 రకాల మందులను అందిస్తున్నామని చెబుతున్నారు. కానీ అక్కడ ప్రత్యక్షంగా మా గ్రామంలోకి వచ్చిన 104 వాహనంలోని సిబ్బందిని అడిగితే 20 రకాల మందులనే మేము సరఫరా

చేస్తున్నామని చెబుతున్నారు. అంతేకాకుండా ఆ వాహనాల్లో పని చేసే సిబ్బంది సంక్షేమాన్ని మనం చూసినట్లయితే సక్రమంగా వారు సేవలను అందించడానికి ఆస్కారం ఉంటుంది. కాబట్టి ఆ సిబ్బందికి ముందుగా జీతాలు అందే పరిస్థితిని కల్పించమని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. అలాగే 145 క్రొత్త వాహనాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నారు. గతంలో ఉన్న వాహనాల సంఖ్యకు అదనంగా 145 వాహనాలను తీసుకొస్తున్నారా? లేక ఆగిపోయిన వాహనాలకు బదులుగా ఈ 145 వాహనాలున తీసుకొస్తున్నారా? అనే విషయాన్ని క్లారిఫై చేయాల్సిందిగా కోరుతున్నాము.

ఎందుకంటే ప్రారంభంలో ప్రభుత్వం ట్రైల్ రన్‌గా కొన్ని వాహనాలను పెట్టుకోవడం జరుగుతుంది, ఈనాడు పెరిగిన అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ వాహనాల సంఖ్యను రెట్టింపు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ వైపు ఏమైనా మీరు ఆలోచన చేస్తున్నారా? ఆ విధమైన నిర్ణయాలను తీసుకునే పరిస్థితులు ఉన్నాయా? ప్రస్తుతం ఈ వాహనాల్లో టెక్నీషియన్‌ని మాత్రమే పంపిస్తున్నారు. ఆ విధంగా కాకుండా ఇవాళ ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులు చాలా మంది ఉన్నారు, ఎన్నో కళాశాలలు వచ్చాయి, వైద్యులను చాలా మందిని తయారు చేశామని ఎంతో గొప్పగా చెప్పుకొంటున్నాం. ఆ విధంగా అందుబాటులో ఉన్న వైద్యులందరినీ ఉపయోగించుకొని ఈ 104 వాహనాల ద్వారా ఆ వైద్యులను గ్రామ సేవలకు అందించే విధంగా నిర్ణయం తీసుకొని, వాళ్లను అపాయింట్ చేస్తారా? ఆ రకంగా చేయమని కూడా మా తరపున కోరుతున్నాము. అదే విధంగా ఈనాడు గ్రామీణ ప్రాంతంలో ఆర్ఎంపీ డాక్టర్లు కూడా ఉన్నారు. ఆర్ఎంపీ డాక్టర్లకు గతంలో కొంత మందికి శిక్షణనిచ్చిన పరిస్థితులు కూడా ఉన్నాయి. మిగిలిన వారికి కూడా శిక్షణా కార్యక్రమాలను అందించి, వారి ద్వారా గ్రామాల్లో నివశించే సమాన్య ప్రాజానీకానికి వైద్య సేవలను అందించాలని  కోరుతున్నాము.

శ్రీ కె.శ్రీధర్ రెడ్డి (నెల్లూరు రూరల్) ః అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 108 మరియు 104 వాహనాలు ఎన్ని ఉన్నాయి? ఎంత మంది సిబ్బంది ఆ వాహనాల్లో పని చేస్తున్నారు? వారికి జీతాలను సక్రమంగా చెల్లిస్తున్నారా లేదా? ఆ వాహనాల్లో పని చేసే సిబ్బందిని పర్మనెంట్ చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? సదరు వాహనాల రిపేర్ల నిమిత్తం నెలకు ఎంత బడ్జెట్‌ను కేటాయిస్తున్నారు? దయచేసి తెలియజేయాల్సిందిగా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి(రాయచోటి) ః అధ్యక్షా, ఈ 108 వాహనాలను దేశంలో మొట్టమొదటిగా పేద ప్రజలకు గ్రామీణ ప్రాంతాలకు ఉపయోగపడాలి, ఏ పేదవాడు వైద్యం అందకుండా మరణించకూడదు, costaly affair గా ఉండకూడదని మొట్టమొదట ఆలోచన చేసి ప్రవేశపెట్టిన ఘనత డా.వైఎస్ రాజశేఖరరెడ్డి గారికి దక్కుతుంది. ప్రవేశపెట్టిన తర్వాత కూడా దీనిని దేశ వ్యాప్తంగా ప్రతి రాష్ట్రం అమలు చేయడానికి ముందుకు రావడం మనం గర్వించాల్సిన

విషయం. ముఖ్యంగా గౌరవ మంత్రి గారిని అడిగేదేమంటే ప్రతి ఒక్క మండల హెడ్ క్వార్టర్‌లో ఒక 108 వాహనం ఉండటం చాలా శ్రేయస్కరం. చాలా మండలాల్లో అటువంటి పరిస్థితులు లేవు. రెండు మండలాలకు కలిపి ఒక అంబులెన్స్ అంటున్నారు. అవి కూడా ఇంతకు ముందు చెప్పిన విధంగా డీజిల్ లేదనో సిబ్బంది లేదనో కొన్ని వాహనాలను మూలన పెట్టారు. అత్యాధునికమైన పరికరాలతో ఎమర్జెన్సీ, ట్రామా కేర్ కోసం తీసుకోవాల్సిన సౌకర్యాలన్నీ అంబులెన్స్‌లో ఏర్పాటు చేసి, ఈ వాహనాలను ఇంకా అభివృద్ధి చేస్తే బాగుంటుంది. అదే విధంగా మంత్రి గారు యావరేజ్ టైమింగ్స్ గురించి చెప్పారు. దానిని ఇంకా 15 నిమిషాలకు కుదిస్తే బాగుంటుంది. 108 వాహనాలు నేషనల్ హైవేస్‌లో ప్రయాణం చేసే ధనవంతులకు కూడా చాలా ఉపయోగపడుతుంది. అదే విధంగా 104 వాహనాన్ని కూడా మంత్రి గారు ఏదైతే చెబుతున్నారో ఫాలో అప్ అని, మెడిసిన్స్ ఇచ్చిన తర్వాత ఫాలోఅప్ యాక్షన్‌గా కొన్ని అసుపత్రులకు సిఫార్స్ చేసి ఆయా అసుపత్రుల్లో ట్రీట్‌మెంట్ తీసుకునే విధంగా కూడా ఆదేశాలను జారీ చేయాల్సిందిగా కోరుతున్నాము.

డా. కామినేని శ్రీనివాస్(కైకలూరు)ః అధ్యక్షా, 104 వాహనాలు 251 ఉన్నాయి. అలాగే 108 వాహనాలు 436 ఉన్నాయి. అందులో 29 వాహనాలు స్టాండ్ బైగా ఉన్నాయి. నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం 104 సర్వీసుల్లో డాక్టర్లను పంపిస్తున్నాము. ఇంకా ఇంప్రూవ్ చేయడానికి ప్రయత్నం చేస్తాము. ఆర్ఎంపీలుగా ఉండి శిక్షణను పూర్తి చేసిన వారిని ఏ విధంగా వారి సేవలను వినియోగించుకోవాలి, మిగిలిన ఆర్ఎంపీలకు కూడా శిక్షణను పూర్తి చేసిన తర్వాత తప్పకుండా తీసుకుంటాం. సిబ్బంది జీతాలు ఇవన్నీ త్వరితగతిని రెగ్యులరైజ్ చేస్తాము. ఈ 104 మరియు 108 వాహనాల్లో పని చేసే సిబ్బందిని పిపిఏ మోడల్‌లో అపాయింట్ చేశారు. దాంట్లో మనం రెగ్యులరైజ్ చేయడానికి అవకాశం లేదండి. దయచేసి గమనించాల్సిందిగా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

...

ప్రతి మండలానికి ఒక వాహనం ఉండేట్టుగా తప్పకుండా ప్రయత్నం చేస్తామనే విషయాన్ని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. It will be examined. త్వరలోనే టెలిమెడిసిన్‌ను కూడా ఇంప్రూవ్ చేసి తద్వారా ఆ సర్వీస్‌ను కూడా 104, 108 సర్వీసెస్‌కు కలుపుదామనే విషయంలో తప్పకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే విషయాన్ని ప్రభుత్వపరంగా నేను సభకు తెలియజేస్తున్నాను.

**MR.SPEAKER: Question No. 70(16) is postponed at the request of the Member.**

**Question No. 129 (17) Minister for Minorities Welfare.**

ప్రశ్న నెంబర్: **129 (17):**

**సర్వశ్రీ అత్తర్ చాంద్ బాషా, జలీల్ ఖాన్, మహ్మద్ ముస్తాఫా షేక్, అంజాద్ బాషా ఎస్.బి., ఎస్.వి.మోహన్ రెడ్డి, బుడ్డా రాజశేఖర రెడ్డి – ఎమ్మెల్యేలు.**

గౌరవనీయులైన మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధికి సబ్- ప్లాన్ ద్వారా ప్రభుత్వం నిధులను కేటాయించే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

ఆ) అయితే, దానికి ఏవైనా ప్రణాళికలు రూపొందించడమయిందా?

సమాచార, పౌర సంబంధాలు మరియు మైనారిటీల సంక్షేమం మరియు సాధికారత శాఖ మంత్రి (శ్రీ పల్లె రఘునాథరెడ్డి):

అ) లేదండి.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ అత్తర్ చాంద్ బాషా(కదిరి): అధ్యక్షా, రాష్ట్రంలో మైనారిటీల స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయి, వారందరు కూడా దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారనే విషయాన్ని ప్రతి కమీషన్ కూడా చెప్పడం జరుగుతూ ఉంది. జస్టిస్ శ్రీ రంగనాథ్ మిశ్రా కమీషన్ గానీ, సచార్ కమిటీ గానీ, బి.సి.కమీషన్ గానీ చాలా సందర్భాల్లో చెప్పడం జరిగింది. ఈ రాష్ట్రంలో మైనారిటీలందరూ దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారని, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ మైనారిటీల సంక్షేమం పట్ల కేవలం ఎన్నికల ముందు ఓట్ల కోసం మైనారిటీలకు హామీలిచ్చి, తద్వారా మైనారిటీల ఓట్లతో ఎన్నికల్లో గెలుస్తున్నారు గానీ వారి సంక్షేమం పట్ల ఇంతవరకు ఏ ప్రభుత్వం కూడా సరైన పద్ధతిన అవలంబించలేదనే విషయాన్ని ప్రతి ఒక్కరు చెబుతారు. అదే విధంగా రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం కోసం మేం ఫలానా పథకాలు చేపడుతున్నామని చెప్పి పలు రకాలుగా ముస్లింలకు దుకాన్-మకాన్, రోష్ని తదితరా పథకాలు అమలుచేస్తామని చెప్పడం, అదే విధంగా మసీదులకు రంగులు పూయడం వంటి పనులు చేయడం కాదు సంక్షేమమంటే. నిజంగా మైనారిటీల సంక్షేమం పట్ల ప్రభుత్వం ఏ విధమైన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలుజరపాలని గానీ, మైనారిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏ విధంగా పాటుపడితే ప్రయోజనం ఉంటుందో, వారు ఏ విధంగా జీవితంలో స్థిరపడతారో అందుకు అనుగుణంగా పథకాలు అమలుజరగాల్సిన అవసరముంది. ఆ విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లైతే ప్రయోజనం చేకూరుతుంది.

ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా మరీ ముఖ్యంగా పంక్చర్ షాపులో గానీ, సైకిల్ మరియు ఆటోమొబైల్ షాపుల్లో గానీ ఎక్కువగా ముస్లిం సోదరులు, పిల్లలే పనిచేస్తున్నారు. వారిని ప్రభుత్వం ఏ విధంగా ఆదుకోవాలనే విషయాన్ని ఆలోచించాల్సిన అవసరముంది. అందుకు గాను ప్రభుత్వం చేస్తున్న ఆలోచన ఏమిటో సభకు తెలియజేయాలని నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అదే విధంగా రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఈరోజున ఉర్దూ అకాడమి గానీ, మైనారిటీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ గానీ హజ్ హౌస్ గానీ - ఎక్కడ కూడా మైనారిటీల ఆస్తులుగానీ, వక్ఫ్ భూముల పరిరక్షణ గానీ చేయడం లేదని నేను భావిస్తున్నాను. ఆ విషయంలో పూర్తి స్పష్టత రావాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించాలని నేను ఈ సందర్భంగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఇప్పుడున్న పరిస్థితులను వక్ఫ్ బోర్డ్ దృష్టికి తీసుకుపోగా నాకు తెలిసినదేమిటంటే, ఉభయ రాష్ట్రాలకు ఒకే అధికారి విధులు నిర్వర్తించడం వల్ల స్పష్టమైన వైఖరి కనబడటం లేదు. సరైన సమాధానం కూడా రావడం లేదు. అదే విధంగా రాష్ట్ర విభజన జరిగిన తరువాత రాష్ట్రంలోని వక్ఫ్ బోర్డ్ ఆస్తుల గురించి గాని, వాటి పరిరక్షణ గురించి గానీ ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని నేను మీ ద్వారా కోరుతున్నాను. వక్ఫ్ఆస్తులు, భూములు రాష్ట్ర వ్యాప్తంగా అన్యాక్రాంతమవుతున్నాయనే కథనాలు ప్రతి నిత్యం టి.వి.ల్లో, దినపత్రికల్లో వెలువడుతున్నాయి. అందుకుగాను ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో కూడా సభకు తెలియజేయాల్సిన అవసరముంది. వక్ఫ్ భూములెక్కడెక్కడ ఉన్నాయో వాటి పరిరక్షణకు గాను ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసినట్లైతే రక్షణ ఏర్పడి ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుంది. ఏ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటికీ మైనారిటీల సంక్షేమానికి బడ్జెట్‌లో రెండు, మూడు వందల కోట్లు కేటాయించడం జరుగుతుందనే మాటలను కేవలం అంకెల గారడిగా, ప్రగల్భాలు గుప్పించడం మాత్రమే జరుగుతుంది తప్ప, ఆచరణలోకి వచ్చేసరికి మైనారిటీ సంక్షేమానికి గానీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు గానీ కేటాయించిన మొత్తంలో ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో 20% మేరకు కూడా నిధులు విడుదలయ్యే అవకాశం లేకుండా పోతోంది. నేను చెబుతున్న విషయం వాస్తవం. గతంలో ఆనాటి ప్రభుత్వాలు బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమం కొరకు ఏ విధమైన కేటాయింపులు చేశాయి, ఆ కేటాయింపుల్లో ప్రభుత్వం పేద, బడుగు మైనారిటీలకు ఖర్చు చేశాయనే విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఒకసారి ఆలోచిస్తే వాస్తవం తెలుస్తుంది. కాబట్టి మైనారిటీ సంక్షేమం కొరకు ప్రభుత్వం ప్రవేశపెట్టే ఎన్నో సంక్షేమ పథకాలు క్రింది స్థాయిలో చేరే వరకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. అదే విధంగా మైనారిటీలకు ఇంతవరకు ఏ మేరకు బ్యాంక్ లింకేజ్ లోన్లు ఇచ్చారో, అందుకు గాను అర్హులైన వారి జాబితా గురించి కూడా ప్రభుత్వం వివరించాల్సిన అవసరముంది. మైనారిటీలకు వివాహ సమయంలో రూ.25,000/- లు ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం చేసి ఆదుకుంటుందనే విషయాన్ని ఎన్నికల ముందు వాగ్దానం చేయడం జరిగింది. అలాగాకుండా రూ.50,000/- లు ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయాన్ని అందించే కార్యక్రమం ప్రభుత్వం

ఎప్పటి నుంచి చేపట్టబోతోందో కూడా సంబంధిత మంత్రి వర్యులు సభకు తెలియజేయాలని నేను మీ ద్వారా కోరుతున్నాను. ఇంతవరకు ప్రభుత్వం తరఫున ఎన్ని మైనారిటీల వివాహాలు జరిగాయి. గతంలో ఎన్ని వివాహాలు జరిగాయి? ప్రస్తుత సంవత్సరానికి ఎన్ని మైనారిటీ జంటలకు వివాహాలు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది? వారికి అందించిన ఆర్థిక సహాయం తదితర సమాచారాన్ని కూడా ప్రభుత్వం సభకు ఇవ్వాల్సిన అవసరముంది. రాష్ట్రంలోని మైనారిటీలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడినవారు చాలా మంది ఉన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం ఏ విధంగా చర్యలు తీసుకుంటుందో తెలియజేయాల్సిన అవసరముందనే విషయాన్ని తెలియజేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ జలీల్ ఖాన్ (విజయవాడ-వెస్ట్): అధ్యక్షా, మైనారిటీల సంక్షేమం గురించిన ప్రశ్న సభలో ప్రస్తావనకు వచ్చింది కాబట్టి అదనంగా కొంత సమయాన్ని కేటాయించవల్సిందిగా ప్రథమంగా కోరుతున్నాను. ప్రభుత్వం మా బాధలను వినాల్సిన అవసరముంది ఎందుకంటే మైనారిటీల గురించి మేం చెప్పడం కాదు గతంలో ఆనాటి యు.పి.ఎ. ప్రభుత్వంలో ఆనాటి భారత ప్రధానమంత్రి గారైన డా.మన్మోహన్ సింగ్ గారే స్వయంగా చెప్పడం జరిగింది. ఎస్సీ, ఎస్టీల కంటే కూడా చాలా అధ్వాన్న పరిస్థితుల్లో ఈనాడు భారత దేశంలో ముస్లింలున్నారనే విషయాన్ని చెప్పడం జరిగింది. ప్రత్యేకించి రాష్ట్ర విభజన అనంతరం ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో మైనారిటీలు చాలా వెనుకబడి ఉన్నారు. నేను ఈ సందర్భంగా మీ ద్వారా ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. కేంద్ర ప్రభుత్వం నుంచి మైనారిటీ సంక్షేమం గురించి ఎన్నో నివేదికలందినప్పటికీ, ఆర్థికపరంగా, విద్యాపరంగా ఎస్సీ, ఎస్టీల కంటే కూడా మైనారిటీలు చాలా వెనుకబడి ఉన్నారనే విషయాలను చెప్పినప్పటి కీ రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిలో స్పష్టత లేకుండా పోయింది. ఎస్సీ, ఎస్టీలకు సబ్ ప్లాన్ ఏర్పాటు చేసినట్లుగా మైనారిటీలకు సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి తద్వారా కార్యక్రమాలు అమలవుతున్నాయా, లేదా అనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించవలసి ఉంది. ఆ విషయంలో ప్రభుత్వ వైఖరేమిటో కూడా ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముంది. మీరూ గుంటూరు జిల్లా వాసే. కాబట్టి జిల్లాలోని ముస్లిం మైనారిటీలు ఏ శాతం మేరకు ఉన్నారో, ప్రక్కనున్న కృష్ణా జిల్లాలో ఉన్న మైనారిటీల శాతం ఏ మేరకు ఉందో మీకు అవగాహన ఉంది. గతంలో మీరు గుంటూరు జిల్లా నర్సరావుపేట నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీచేసినప్పుడు మీ గెలుపుకు కూడా మైనారిటీల ఓట్లే ప్రధాన కారణం. ప్రభుత్వం మైనారిటీ సంక్షేమం కొరకు ఏ విధమైన న్యాయం చేయబోతుందో తెలియజేయాల్సిన అవసరముంది.

శ్రీ అత్తర్ చాంద్ బాషా (కదిరి): అధ్యక్షా...

MR.SPEAKER: Please be seated Chand Basha garu. మీరు అన్ని విషయాలను మాట్లాడారు కదా! త్వరగా ముగించండి జలీల్ ఖాన్ గారు.

శ్రీ జలీల్ ఖాన్ (విజయవాడ వెస్ట్): అధ్యక్షా, మాకిచ్చిన సమయమే కొంత. మరి కొంత సమయం మైనారిటీల గురించి మాట్లాడే అవకాశం నాకు కల్పించండి.

అధ్యక్షా, గతంలో ఆనాటి ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించడం వల్ల వందలాది మంది ముస్లిం యువత డాక్టర్లుగా, ఇంజనీర్లుగా తయారవుతున్నారు. మా పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచి మా వర్గాన్ని కాపాడిన దేవుడు, ఏకైక వ్యక్తి మరియు నాయకుడు స్వర్గీయ డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు.

శ్రీ కాల్వ శ్రీనివాసులు(రాయదుర్గం): అధ్యక్షా...

శ్రీ జలీల్ ఖాన్ (విజయవాడ వెస్ట్): అధ్యక్షా, నేను మాట్లాడుతున్నాను. మధ్యలో చీఫ్ విప్ గారు మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు. దయచేసి వారించండి. వారు అధికార పక్షం వైపు ఉంటూ మాటిమాటికి నిల్చొని మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు.

నేను ఎవరినీ విమర్శించడం లేదు. మా బాధను ప్రభుత్వానికి తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నాను నేను. దయచేసి అర్థం చేసుకోండి.

మిస్టర్ స్పీకర్: జలీల్ ఖాన్ గారు, మీరు ఏ విధంగా మాట్లాడినప్పటికీ ఎటువంటి అభ్యంతరం లేదు కానీ please confine yourself to subject.

శ్రీ జలీల్ ఖాన్ (విజయవాడ వెస్ట్): సరే అధ్యక్షా, నాకు ఒక విషయం తెలియక మీ ద్వారా ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. నేను కూడా గత 23 సంవత్సరాల నుంచి రాజకీయాల్లో ఉన్నాను. గతంలో ఎప్పుడు కూడా అధికార పక్షం వైపు నుంచి ఈ తరహాలో నిల్చొని ప్రతిపక్షం వైపు వారు మాట్లాడుతున్న సమయంలో వారిని వారించే ప్రయత్నం చేయలేదు. నేను గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితిని చూడలేదు. ప్రతిపక్షం ఎప్పుడూ బాధల గురించి చెప్పే ప్రయత్నమే చేస్తుంది. కానీ అధికార పక్షం అందుకు సహకరించడం లేదు. దయచేసి మీరు ఒక విషయం గురించి ఆలోచన చేయండి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పదమూడు జిల్లాల్లోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను నలుగురు ముస్లిం వ్యక్తులకు వై.ఎస్.ఆర్. పార్టీ తరఫున మా నాయకుడు శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించగా, నాలుగురు కూడా ఈనాడు ఎమ్మెల్యేలుగా గెలిచి సభలో అడుగుపెట్టడం జరిగింది. కానీ, ఈ రాష్ట్రంలో అధికారపక్షం వైపు ఒక ముస్లిం శాసనసభ్యుడు కూడా లేనిపరిస్థితి వుంది. అదేవిధంగా మైనారిటీలకు సంబంధించిన సంక్షేమ

శాఖకు ఒక మైనారిటీ ముస్లిం వ్యక్తి మంత్రిగా పనిచేయలేని దౌర్భాగ్యకరమైన పరిస్థితి మనకందరికీ తెలుసు.

మిస్టర్ స్పీకర్: జలీల్ ఖాన్ గారూ, మీ ప్రశ్నేంటి? నిధుల కేటాయింపు గురించి మీరు ప్రశ్న వేశారు. కానీ మీరు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం లేదు. Don't misuse the opportunity. సింగిల్ సప్లిమెంటరీ అయినప్పటికీ నేను ఇద్దరు సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించాను. మీరు సద్వినియోగం చేసుకోకుంటే ఎట్లా?

శ్రీ జలీల్ ఖాన్ (విజయవాడ వెస్ట్): అధ్యక్షా, త్వరగా ముగిస్తాను. దయచేసి మాట్లాడే అవకాశం ఇవ్వండి.

...

మిస్టర్ స్పీకర్ : దయచేసి సహకరించండి. మాట్లాడే అవకాశం వచ్చింది మీరు మాట్లాడారు. దయచేసి కూర్చోండి. జగన్మోహన్ రెడ్డి గారు మీసభ్యులు మాట్లాడటానికి సమయం ఇచ్చాను. ఐనప్పటికీ మాట్లాడాలంటూ సభకు అంతరాయం కల్పిస్తున్నారు. మీరు సహకరించకపోతే సభ ఎలా నిర్వహించగలం? దయచేసి సహకరించండి, మీరు మాట్లాడండి.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి(పులివెందుల) : రెండు నిమిషాలు సమయం ఇవ్వండి. వారు మాట్లాడాల్సింది మాట్లాడుతారు. అలా ఎందుకు అడుగుతున్నారంటే దానికి కారణం ఉంది. కారణమేమిటంటే మంత్రిగారు ఇంతకు మునుపు సమాధానమిస్తూ, వక్ఫ్‌బోర్డ్ ఇక్కడ లేదు, కాబట్టి సమాధానం చెప్పాల్సిన పనిలేదన్నట్లుగా వారి జవాబు ఉంది. కాబట్టి వారికి కొంత బాధ కలుగు తోంది. వక్ఫ్‌బోర్డ్ అనేది ఎప్పుడు ఏర్పాటు చేస్తారు. అసలు వక్ఫ్‌బోర్డ్ అనేది రాష్ట్రానికి ఉంటుందా - ఉండదా అనేది తెలియాల్సిన అవసరం ఉంది కాబట్టి మా సభ్యులు మాట్లాడాలని కోరుతున్నారు.

MR.SPEAKER: Single supplementary.. అని చెప్పి ఇద్దరికి అవకాశం ఇచ్చాను. You have to understand that.

శ్రీ జలీల్ ఖాన్ (విజయవాడ వెస్ట్) : తమద్వారా ప్రభుత్వాన్ని కోరేదేమనగా రాష్ట్రం విడిపోయింది కాబట్టి వక్ఫ్‌బోర్డ్ ఏర్పాటు చేయడానికి ఎంత సమయం పడుతుందన్న దానిపై మాకు సమాధానం కావల్సి ఉంది. రెండవదేమనగా రాష్ట్రంలో ముస్లీం మైనారిటీల కష్టాల్ని దృష్టిలో ఉంచుకొని వారికి ఉప ప్రణాళిక అమలు చేస్తారా లేదా తెలపాలి. (విమర్శ చేస్తున్నారంటూ అధికార పక్షం వైపు నుండి అంతరాయం) సమస్య చెపుతున్నాను సార్, నేను విమర్శించడం లేదు. ముస్లిం సోదరులు హజ్‌కు వెళ్లే సమయం వచ్చింది. ఈ నెలాఖరులో వారు హజ్ యాత్రకు వెళ్లాలి. గతంలో మాదిరి హైదరాబాద్ మన రాష్ట్రం పరిధిలో లేదు.

మిస్టర్ స్పీకర్ ః మీరు మాట్లాడే దానికి అడిగిన ప్రశ్నకు సంబంధం లేదు జలీల్ ఖాన్ గారూ ముగించండి. If you want to talk about Haj and other subjects, then come in a different form. Now, please conclude.

శ్రీ జలీల్ ఖాన్ (విజయవాడ వెస్ట్) ః సబ్ ప్లాన్‌ను అమలు చేస్తారా లేదా, వక్ఫ్‌బోర్డ్ ఎప్పుడు ఏర్పాటు చేస్తారు? సమాధానం కావాలి సార్.

మిస్టర్ స్పీకర్ ః మంత్రిగారూ..

శ్రీ పల్లెరఘునాథరెడ్డి(పుట్టపర్తి) ః అధ్యక్షా, గౌరవ ప్రతిపక్ష నాయకులు శ్రీ జగన్మోహన్ రెడ్డి గారు ప్రశ్నను సరిగా చూశారో లేదో నాకు తెలియదు కానీ, రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధికి సబ్ ప్లాన్ ద్వారా ప్రభుత్వం నిధులను కేటాయించే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా అనే ప్రశ్నకు సమాధానం లేదని చెప్పాను. వక్ఫ్‌బోర్డ్స్ గురించి ప్రశ్న అడగ లేదు. వారు అడిగిన ప్రశ్న వేరుగా ఉంది. దయచేసి వారు అడిగిన ప్రశ్నను గమనించ వలసిందిగా గౌరవ ప్రతిపక్ష నాయకులను నేను కోరుతున్నాను. అధ్యక్షా, వారు అడిగిన ప్రశ్నకు, ఇప్పుడు అడుగుతున్న ప్రశ్నకు సంబంధం లేదు. ఐనప్పటికీ బాధ్యత కలిగిన మంత్రిగా వారడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెబుతాను. దయచేసి ఓపిగ్గా వినవల్సిందిగా కోరుతున్నాను.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులచే సభకు అంతరాయం )

MR. SPEAKER : Minister garu, please brief it.

శ్రీ పల్లెరఘునాథరెడ్డి (పుట్టపర్తి)ః గౌరవ శాసన సభ్యులు అత్తర్ చాంద్ భాషా గారు ముస్లిం మైనారిటీ సోదరుల పట్ల ఎంతో ఆదరం చూపించారు. చాలా సంతోషం. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, గతంలో శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో కనీ వినీ ఎరుగని రీతిలో ఏరాష్ట్రంలో ఎవరూ చేయని విధంగా రూ.7500లతో మసీదులకు మరమ్మత్తులు చేయడమే కాకుండా వాటితోపాటు ప్రతి మండలంలో షాదీ ఖానాలు కట్టించారు. (అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు) అంతేకాదు బరియల్ గ్రౌండ్స్, మసీదులకు కాంపౌండ్స్ కట్టించడం మైనారిటీల సంక్షేమం కోసం రోప్లీ, ఈద్గాలు, దుకాన్-మకాన్, షాదీఖానా వంటి చారిత్రాత్మక పనులు చేపట్టారన్న విషయాన్ని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలున్న సమయంలో వీరి బడ్జెట్ రూ.100 కోట్ల కన్నా తక్కువగా ఉన్నటువంటి సందర్భంలో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.1000కోట్లకు పెంచిందన్న విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ ఘనత, కీర్తి తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులచే సభకు అంతరాయం )

మిస్టర్ స్పీకర్ : దయచేసి సహకరించండి. కూర్చోండి.

శ్రీ పల్లెరఘునాథరెడ్డి (పుట్టపర్తి) : ఇకపోతే సబ్-ప్లాన్ ద్వారా నిధులు విడుదల చేస్తారా అని అడిగారు. భారత రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే వారి రక్షణ, భద్రత కోసం ప్రత్యేక ప్రొవిజన్ కల్పించారు. అందువల్ల వారికి సబ్-ప్లాన్ కేటాయించడమైనది. కానీ ముస్లిం మైనారిటీలు, బీసీ సోదరులు మాకు కూడా సబ్-ప్లాన్ కావాలని కోరడం జరిగింది. ఆ ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి అని ఈ సందర్భంగా తమ ద్వారా వారికి తెలియజేసుకుంటున్నాను. ముస్లిం మైనారిటీ సోదరుల హక్కుల ప్రయోజనాలు కాపాడేటందుకు ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో, అంకిత భావంతో ఉందని కూడా తమద్వారా వారికి తెలియజేసుకుంటున్నాను. (ప్రధాన ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం ) శ్రీ అబ్దుల్ కలాం గారిని భారత రాష్ట్రపతిగా ఎన్నిక చేసే విషయంలో ప్రధాన పాత్ర వహించిన వారు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అని, ఆ ఘనత వారితోపాటు ఈ తెలుగుదేశం పార్టీకి దక్కుతుందని కూడా మీ ద్వారా వారికి తెలియజేసుకుంటున్నాను. సమైక్యాంధ్రప్రదేశ్‌లో మైనారిటీ సంక్షేమం కోసం రూ.1027కోట్లు బడ్జెట్ ప్రతిపాదించగా అందులో రూ.670కోట్లు విడుదల చేశారు. కానీ అందులో వాస్తవంగా ఖర్చు అయింది రూ.493కోట్లు మాత్రమే. అంటే గతంలో పనిచేసిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పనితీరు దీనిద్వారా అర్థమౌతోంది.

...

MR SPEAKER: Please conclude.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా, స్కాలర్‌షిప్స్ గురించి అడిగారు. రెసిడ్యూయరీ ఆంధ్రప్రదేశ్‌లో 91,485 మంది అప్లై చేశారు.

(వై.ఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి అంతరాయం )

మిస్టర్ స్పీకర్: మినిష్టరుగారి సమాధానం వినరా?

శ్రీ పల్లె రఘునాథరెడ్డి (పుట్టపర్తి): 78,690 మంది అప్లికేషన్స్‌ను పరిశీలించడం జరిగింది. వీటికి గాను ఆర్.టి.ఎఫ్ గాని, ఎం.టి.ఎఫ్ గాని రూ.139.30 కోట్లు కావాలి. దానిలో రూ.49.35 కోట్లు రిలీజ్ చేశాము. మిగతాది కూడా త్వరలో రిలీజ్ చేసే ప్రయత్నం చేస్తున్నాము. అదేవిధంగా బ్యాంక్ లింక్డ్ ద్వారా చాలా పేదవారి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకోవలసిన అవసరం ఉంది. 11,885 అని టార్గెట్ ఇచ్చారు. దానికి గాను రూ.44.60 కోట్లు అమౌంటు రిలీజు కావాలి. కానీ ఈ ప్రభుత్వం 9,698 శాంక్షన్స్ ఇచ్చారు. రూ. 39.98 లక్షలు రిలీజు

చేశారు. కానీ టార్గెట్ అచీవ్‌మెంట్ అనేది 6,054 మందిని మాత్రమే ఇచ్చారు. దానికి రూ.22,95,53,000 రిలీజు అయింది. సంక్షేమం పట్ల మాకు ఎంతో చిత్తశుద్ధి వుంది. మేం అధికారంలోకి వచ్చి రెండు నెలలే అయింది.

మాస్ మ్యారేజెస్ గురించి అడిగారు అధ్యక్షా. 2013-2014వ సంవత్సరంలో 93 మందికి మాస్ మ్యారేజెస్ కండక్ట్ చేయడం జరిగింది. దీనికోసం రూ.23.25 లక్షలు ఖర్చుపెట్టడం జరిగింది. దీనిని కూడా పెంచాలని ప్రతిపక్షం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. ఇది కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉంది అధ్యక్షా.

తర్వాత వక్ఫ్ బోర్డు గురించి అడిగారు. రాష్ట్ర పునర్విభజన చట్టం షెడ్యూల్-10లో ఉంది. ఈ 10వ షెడ్యూల్‌లో ఉన్న పోస్టులను ఫిలప్ చేసేందుకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియాకు ప్రతిపాదనలను పంపించాము, అక్కడ నుంచి రావాలి. స్పెషల్ ఆఫీసర్స్‌ను నియమించాలి, 9వ షెడ్యూల్‌లో కొన్ని, 10వ షెడ్యూల్‌లో కొన్ని ఉన్నాయి. వాటన్నిటినీ ప్రభుత్వం పరిశీలిస్తుంది. ఎక్కడైతే కేంద్రప్రభుత్వం అనుమతి కావాలో వాటికి లేఖలు రాయడం జరిగింది అధ్యక్షా. ఏవైతే కార్యదర్శి లెవెల్లో ఇస్తున్నాము... అదే విధంగా ప్రతిపక్షం అడిగిన ప్రశ్నలన్నింటికీ కరెక్ట్ సమాధానం చెబుతున్నాం అధ్యక్షా.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి అంతరాయం )

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి : (మైకు లేకుండా) సర్...,

MR.SPEAKER: single supplementary from the Leader of the Opposition.

శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి(పులివెందుల): అధ్యక్షా, మంత్రిగారిని అడిగింది మైనార్టీస్‌కి సబ్‌ప్లాన్ ఏదైనా ఉందా అని అడిగారు. సింపిల్ క్వశ్చన్. సబ్‌ప్లాన్ లేదు అని చెబుతూ, తాను తన ఇష్టం వచ్చినట్టు గత ప్రభుత్వాలు ఏం చేశాయి, గత ప్రభుత్వాలు అవి చేశాయి, ఇవి చేశాయి అని చెబుతూ లెక్చర్లు ఇస్తున్నారు.

మిస్టర్ స్పీకర్: ఓకె..

(అధికార పార్టీ సభ్యులు కొంతమంది తమ సీట్లలోంచి లేచి నిలబడ్డారు)

MR SPEAKER: Please be seated.

శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి (పులివెందుల)ః సమాధానం ఏమిటి?... సమాధానం ఏమిటి?... మైనార్టీలకు సబ్‌ప్లాన్ ఉందా లేదా? simple question...

మిస్టర్ స్పీకర్ః జగన్మోహన్ రెడ్డి గారూ..

శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి (పులివెందుల)ః మైనార్టీలకు సబ్‌ప్లాన్ ఉంది అంటే ఉందని చెప్పండి, లేదు అంటే లేదని చెప్పండి. అంతేగాని ఏదేదో సోది చెప్తే ఎలా అండి.

**MR SPEAKER: Question No. 60 (18). Minister for Transport, Roads & Buildings.**

సర్వశ్రీ జి. బుచ్చయ్య చౌదరి (రాజమండ్రి రూరల్), ఎం.ఎల్.ఏ.

అ) రాజమండ్రి వద్ద రోడ్డు కం రైలు బ్రిడ్జ్‌కి వేసిన రోడ్డు దెబ్బతిన్న విషయం వాస్తవమేనా?

ఆ) దీనివల్ల లోపలికి, బయటికి వచ్చి పోయే వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతున్నదా?

ఇ) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకోదలచిన చర్య ఏమిటి?

**రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖా మంత్రి శ్రీ శిద్దా రాఘవ రావు (దర్శి):**

అ) అవునండీ. 2005లో వేసిన రోడ్డు, రోడ్డు కం రైలు వంతెన పై భాగంపై సెకండరీ జాయింట్ల (400 లు) వద్ద దెబ్బతిన్నది.

ఆ) ఇనో ఫ్లో, అవుట్ ఫ్లో ట్రాఫిక్‌పై ఎటువంటి ప్రభావం లేదు. అయితే సెకెండరీ జాయింట్లలలో ఏర్పడిన ఎత్తు పల్లాలు / దిబ్బల వల్ల రవాణా సౌలభ్యానికి ఇబ్బందిగా ఉంది.

ఇ) ఎత్తుపల్లాలను సరిచేసి, బిటి ప్యాచ్‌వర్క్‌ను సమకూర్చడం ద్వారా సెకండరీ జాయింట్ల వద్ద చేసిన అవసరమెన మరమ్మతులు ఆ ఉద్దేశానికి మాత్రమే తాత్కాలికంగా సేవలను అందిస్తూ, రైళ్ల రాకపోకల కారణంగా అధిక కంపనాల వల్ల లోపాలు పునరావృతం అవుతున్నాయి. ఇంతకు ముందు నియమించిన కన్సల్టెంట్లు ఒక మైల్డ్ స్టీల్ గిర్డర్‌తో అదనపు సపోర్ట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అయితే, వంతెన నిర్మాణానికి అట్టి శాశ్వత చర్యలను మాత్రమే చేపట్టాలని దీనికి రైల్వే అధికారులు అంగీకరించలేదు. ఈ విషయంలో రైల్వే వారితో సంప్రదించి, చర్య తీసుకోవడమవుతుంది. 2015లో రాబోతున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా, రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో రవాణా ఉపరితలాన్ని మెరుగుపరచడానికి

తాత్కాలిక మరమ్మతులను చేపట్టాలని నిర్ణయించడమయింది.

శ్రీ జి. బుచ్చయ్య చౌదరి (రాజమండ్రి రూరల్)ః అధ్యక్షా, 1974లో ప్రజా ఉద్యమం వల్ల ఉభయ గోదావరి జిల్లాలకు అనుసంధానంగా రోడ్డు కం రైలు బ్రిడ్జి నిర్మాణం అయింది. ఈ మధ్యకాలంలో గతంలో ఉన్న కాంక్రీట్ వెదర్‌కోట్ తీసేసి బి.టి. వెదర్‌కోట్‌ను వేశారు. 2005లో ఒకసారి, తరువాత మధ్యలో ఒకసారి చేసి సబ్‌స్టాండర్డ్ వర్క్ చేయటంతో మొత్తం డామేజ్ అయిపోతుంది. బ్రిడ్జ్‌కి సైడ్‌లో ఉన్న ప్రొటెక్టెడ్ వాల్స్ అన్నీ కూడా విరిగిపోయి గోదావరి నదిలో పడిపోతున్నాయి. ఇవాళ మాదగ్గర పరిస్థితి ఎలా ఉందంటే, రాజమండ్రిలో ఉన్న ఎముకలు, వెన్నుపూస వైద్యులు ఈ బ్రిడ్జి ఇలానే ఉండాలని కోరుకొంటున్నారు, గైనకాలజీ వైద్యులు మాత్రం వెంటనే రిపేరు చేయాలని కోరుకుంటున్నారు. కారణం ఏమంటే ఆ రిపేరు పనులు జరగకుండా అలానే ఉండం వలన ఆ బ్రిడ్జి మీదనుంచి నడిచి వచ్చే ప్రజలు చాలామంది ఎముకలు, వెన్నుపూస వైద్యులు ఉండే ఆసుపత్రులకు వెళ్లిపోతున్న పరిస్థితి వుంది. గర్భిణులు బస్సులోనో, ఆటోలోనో, కారులోనో బయలుదేరితే ఆ బ్రిడ్జి దాటేటప్పటికి అదే వాహనంలో ప్రసవం అయి పోయే పరిస్థితిలో ఉన్నారు. ఎందుకంటే సరైన విధానంలో రిపేర్లు గతంలో చేయనందువలన ఈ పరిస్థితి వచ్చింది. రైల్వేలు మరియు ఆర్ అండ్ బి శాఖలు కలిసి కృషి చేస్తేనే గాని ఈ వర్క్ కాదు. గత పుష్కరాలకి ఒకే రోజున దాదాపుగా ఎనభై వేల వాహనాలు ఆ బ్రిడ్జి మీద నుంచి ప్రయాణించాయి. సరే, పుష్కరాల కంటే కూడా ఉభయగోదావరి జిల్లాలకు అనుసంధానమైన బ్రిడ్జి దగ్గర లైట్లు వెలగవు, మెయింటెనెన్స్ ఉండదు, పైన డస్ట్ అంతా పేరుకుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో అనేక వాహనాలు నదిలో కూడా పడిపోయాయి. మేం ఒకటే అడుగుతున్నాం. ఈ మధ్య కాలంలో ప్రత్యేకించి మా ఎంపీ గారు శ్రీ మురళీమోహన్ గారు, మేం అంతా కలిసి రైల్వే అధికారులను, జి.ఎం.లను అందర్నీ తీసుకెళ్లి చూపించాం. ఎందుకంటే రైల్వే అధికారులు కో-ఆర్డినేట్ చేస్తే గాని ఆర్ అండ్ బి వాళ్లు వర్క్ చేయలేరు. గత ప్రభుత్వంలో కమిటీ కూడా వేశారు. కమిటీ రిపోర్టు ఇచ్చినా కూడా దానిని అమలు చేయ డంలేదు. వైబ్రేషన్ లేకుండా సపోర్టింగ్ పెట్టడం కోసం రైల్వే వాళ్లు ఒప్పుకోవడం లేదు. పోనీ వాళ్లే చేస్తారా, అంటే వాళ్లు చేయడం లేదు. కనుక దయచేసి రైల్వేలను, ఆర్ అండ్ బి శాఖలను అనుసంధానం చేసి సత్వరమే ఈ పనిని చేయవలసిన అవసరం ఉంది. గతంలో కూడా రూ.2.50 నుంచి 3 కోట్లు ఖర్చు పెట్టి వృథా చేశారే కాని, పని కాలేదు. అందువల్ల గతంలో వేసిన కాంక్రీట్‌వెదర్‌కోట్ ఎక్స్‌పర్ట్స్‌తో మాట్లాడి అదైనా చేయించాలి. సత్వరమే చేయకపోతే ప్రజలు అనేక ఇబ్బందులెదుర్కొనే పరిస్థితి వుంది. కనీసం ఈ బ్రిడ్జికి ముందున్న అప్రోచ్ రోడ్డు వర్క్ అయినా అర్జెంటుగా చేయవలసిన అవసరం ఉంది. అప్రోచ్ రోడ్ వర్క్‌కు ఎలాంటి ఇబ్బంది లేదు. అందువలన ప్రొటెక్టెడ్ వాల్స్, గర్డర్స్ అన్నీ సత్వరమే పూర్తి చేయవలసిందిగా మంత్రిగారిని కోరుతూ, దానికి రైల్వే అధికారులతో ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పమని కోరుతున్నాను.

శ్రీ శిద్దా రాఘవ రావు (దర్శి)ః ఈ బ్రిడ్జ్‌ని కూడా నేను పది రోజుల క్రితం రాజమండ్రి వెళ్లి వ్యక్తిగతంగా సందర్శించడం జరిగింది. వాస్తవంగా సభ్యులు శ్రీ బుచ్చయ్య చౌదరిగారు చెప్పి నట్టు ఆ బ్రిడ్జిలో కొన్ని షార్టేజెస్ ఉన్నాయి. దానికి రైల్వే అధికారులు కోఆపరేట్ చేయటం లేదు. మేం కూడా అధికారంలోకి వచ్చి రెండు నెలలు మాత్రమే అయింది కాబట్టి, వెంటనే రైల్వే అధికారులు, లోకల్ ఎంపీ గారు, ఎం.ఎల్.ఏ.లతో, ఆర్ అండ్ బి అధికారులు అందరితో కలిసి ఒక మీటింగ్ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. ఆ కార్యక్రమం చేపడితే చాలా టైం తీసుకొనే అవకాశం ఉంది. కాబట్టి, పక్కనే కొత్త బ్రిడ్జి తయారవుతుంది. ఆ బ్రిడ్జిని కూడా నేను సందర్శించాను. ఆ బ్రిడ్జి కూడా రాబోయే మార్చి నెలలో రెడీ కాబోతుంది. అది పూర్తి కావటంతోనే దీనికీ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సెంటర్, చెన్నై వారు కూడా వచ్చి చూసి వెళ్లడం జరిగింది. వారితో కూడా మేం ఒక మీటింగ్ ఏర్పాటు చేసుకుని శాశ్వతంగా పరిష్కరించే విధంగా రైల్వే అధికారులతో చర్చించి, దీనిమీద ఒక నిర్ణయం తీసుకుంటాం. తప్పకుండా ఆ బ్రిడ్జికి సభ్యులు శ్రీ బుచ్చయ్య చౌదరి గారు చెప్పినట్టు భవిష్యత్‌లో ఇబ్బందిలేకుండా బ్రిడ్జిని తయారుచేస్తామని వారికి హామీ ఇస్తున్నాను.

**MR SPEAKER: Question No. 140 (19). Minister for Health**

**సర్వశ్రీ చింతల రామచంద్రా రెడ్డి, డా. పెద్దిరెడ్డిగారి రామచంద్రా రెడ్డి & ఎం.ఎల్.ఏ.లు.**

అ) రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో సరైన వైద్య సేవలు లేని కారణంగా ప్రజలు తీవ్రమైన కష్టాలను అనుభవిస్తున్న విషయం వాస్తవమేనా?

ఆ) ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కొరత కారణంగా వెలుపల నుండి మందులను కొనుగోలు చేస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

ఇ) ప్రభుత్వ ఆసుపత్రులలో ఆధునిక పరికరాలు, సౌకర్యాలు లేనందువలన ప్రజల ప్రయివేటు ఆసుపత్రులపై ఆధారపడుతున్నారన్న విషయం కూడా ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

ఈ) నిపుణులైన (స్పెషలిస్టు) వైద్యులు అందుబాటులో లేని కారణంగా ప్రభుత్వ ఆసుపత్రులలో అనేక వైద్యుల పదవుల ఖాళీగా ఉన్న విషయం వాస్తవమేనా?

ఉ) ప్రభుత్వ ఆసుపత్రుల పని తీరును మెరుగుపరచడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి?

**ఆరోగ్య, వైద్య విద్యా శాఖ మంత్రి డా. కామినేని శ్రీనివాస్ (కైకలూరు)ః**

అ) లేదండీ.

ఆ) లేదండీ.

ఇ) లేదండీ.

ఈ) లేదండీ. నిపుణులైన (స్పెషలిస్టు) వైద్యులు అందుబాటులో లేని కారణంగా, కొన్ని స్పెషలిస్టు పదవులు ఖాళీగా ఉన్నాయి.

ఉ) ఎ.పి.ఎం.ఎస్.ఐ.డి.సి. మందులు (ఔషధాలు), పరికరాలు, శస్త్ర చికిత్స పరికరాలను క్రమం తప్పకుండా సేకరిస్తున్నది. ప్రతి జిల్లాలోని కేంద్ర ఔషధ గోదాములలో అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచడమయింది.

ఊ) అల్ట్రాసౌండ్ స్కాన్స్, సి.టి.స్కాన్, ఎం.ఆర్.ఐ. స్కాన్, వెంటిలేటర్స్, మానిటర్స్, ల్యాబ్ ఎక్విప్‌మెంట్ తదితరాలను వైద్య కళాశాల ఆసుపత్రులకు సమకూర్చడమయింది. నియతకాలికంగా కొత్త పరికరాలను సేకరించి సరఫరా చేయడమయింది.

డా. కామినేని శ్రీనివాస్ (కైకలూరు)ః ప్రభుత్వ ఆసుపత్రులలో హెమోడయాలసిస్ యూనిట్లను సమకూర్చడమయింది. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగనిర్ధారణ సేవలను పటిష్టపర చడానికి చర్యలు తీసుకోవడం జరుగుతున్నది.

...

శ్రీ చింతల రామచంద్రారెడ్డి (పీలేరు)ః అధ్యక్షా, మంత్రి గారిని ఒక విషయం స్పష్టంగా అడగడం జరిగింది. రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో సరైన వైద్యసేవలు లేని కారణంగా ప్రజలు తీవ్రమైన కష్టాలు అనుభవిస్తున్న విషయం వాస్తవమేనా అని అడిగితే, సింపుల్‌గా 'లేదండీ' అని చెప్పారు. అధ్యక్షా, ఇక్కడ 175 మంది శాసనసభ్యులం ఉన్నాం. మీరు కూడా స్వతహాగా వైద్యవృత్తిలో ఉన్నవారే. ప్రభుత్వాసుపత్రులంటే, ప్రజలకు ఏమాత్రం విశ్వాసం లేదు. పేషంట్లు ప్రభుత్వాసుపత్రుల్లో ట్రీట్‌మెంట్ తీసుకోవడానికి భయపడి, ప్రయివేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న మాట వాస్తవమా, కాదా, అని తమద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను. రెండవది, ఈరోజు ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే ప్రభుత్వ వైద్యులంతా కూడా ప్రయివేట్ ప్రాక్టీస్ చేసుకుంటున్నారు. ప్రభుత్వాసుపత్రులకు వెళ్ళిన వారిని కూడా, మీరు ప్రయివేట్ ఆసుపత్రులకు రండి, అక్కడ మీకు ట్రీట్‌మెంట్ ఇస్తామని ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే డాక్టర్లు స్పష్టంగా చెబుతున్నారు.

ఈరోజు చాలా ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు లేరు. చాలా ఖాళీలు ఉన్నాయి. మారుమూల ప్రాంతాల్లో చాలాచోట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. కానీ, ఎక్కడా కూడా హెడ్‌క్వార్టర్స్‌లో డాక్టర్లు నివాసముండట్లేదు. గర్భవతులు, యాక్సిడెంట్స్ అయిన వారు అర్ధరాత్రి సమయాల్లో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రభుత్వాసుపత్రుల, ప్రైమరీ హెల్త్ సెంటర్ల పనితీరు చాలా దారుణంగా ఉంది. చాలా అధ్వాన్నంగా ఉంది. ఈరోజు మంత్రిగారు నిపుణులైన డాక్టర్ల గురించి చెప్పారు. నిపుణులైన డాక్టర్ల పోస్టులు చాలాచోట్ల ఖాళీగా ఉన్నాయి. పరికరాలు ఉన్నచోట్ల డాక్టర్లు లేరు. డాక్టర్లు ఉన్నచోట్ల పరికరాలు లేవు. అంతేకాదు,

ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు పెట్టే భోజనం ఎంత అధ్వాన్నంగా ఉందంటే కనీసం తినే పరిస్థితే లేదు. చాలా ఆసుపత్రుల్లో అంబులెన్సులుంటే డ్రైవర్లు లేరు, డ్రైవర్లు ఉంటే అంబులెన్సులు లేవు.

కిడ్నీ జబ్బుతో బాధ పడుతున్న వారిలో చాలామంది ప్రభుత్వాసుపత్రుల్లో సరిపడా డయాలసిస్ యూనిట్లు లేనందున ప్రైవేట్ ఆసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకుంటున్నారు. మా జిల్లాలో స్విమ్స్ హాస్పిటల్ ఉంది. రుయా హాస్పిటల్ ఉంది. అక్కడ డయాలసిస్ చేయించుకోవాలంటే రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌లో చాలినన్ని పడకలు లేనందువలన స్ట్రక్చర్ మీదనే పేషెంట్‌ను పడుకోబెట్టి సెలైన్లు ఎక్కిస్తున్నారు. ఇటీవల మన వైద్య-ఆరోగ్య శాఖామంత్రి శ్రీ కామినేని శ్రీనివాస్ గారు కూడా స్విమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. ఇటీవల పత్రికల్లో, ప్రభుత్వం రోగుల నుంచి యూజర్ ఛార్జీలను వసూలు చేస్తుందని కథనాలు వచ్చాయి. ఈవిషయమై గౌరవ మంత్రిగారు స్పష్టతనివ్వాల్సిన అవసరముంది. ఈరోజు రాష్ట్రంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్‌లు ప్రజల్ని వణికిస్తున్నాయి.

ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు లేరు. ఫార్మసిస్ట్‌లు లేరు. చాలా కేంద్రాల్లో బ్లడ్‌టెస్ట్ చేసేవాళ్ళుకూడా లేరు. బయటకు వెళ్ళి బ్లడ్‌టెస్ట్, ఇతర ఇన్వెస్టిగేషన్‌లు చేయించుకుంటున్నారు. ఎక్కువ శాతం పెద్ద ఆసుపత్రుల్లో, కమ్యూనిటీ హాస్పిటల్స్‌లో, 100 పడకల ఆసుపత్రుల్లో కూడా అత్యవసరంగా వినియోగించే ఆక్సిజన్ సిలిండర్లు లేవు. రక్తం కావలసి వస్తే ప్రైవేటు బ్లడ్‌బ్యాంకులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది.

MR.SPEAKER: Please be brief.

శ్రీ చింతల రామచంద్రారెడ్డి (పీలేరు): ఒక్క నిముషం అధ్యక్షా. స్వర్గీయ శ్రీ వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మకమైన పథకం-ఆరోగ్యశ్రీ. ఈ ఆరోగ్యశ్రీ పథకం వలన లక్షలాది మంది పేద ప్రజలు శ్రీ రాజశేఖర రెడ్డిగారి పుణ్యమా అని ఉచితంగా వైద్యం పొందుతున్నారు. అయితే, ఆరోగ్యశ్రీ నుంచి కూడా కొన్ని జబ్బులు తీసేశారు. ఈ రకంగా ఉంది ఈ రాష్ట్రంలో పరిస్థితి. గౌరవ మంత్రిగారేమో 'సరైన వైద్యసేవలు అందక ప్రజలు కష్టాలనుభవిస్తున్నారని' అడిగితే, 'లేదండీ' అని సమాధానం ఇచ్చారు. గౌరవ మంత్రిగారిని ఒక కమిటీని నియమించమనండి. వారితోపాటు మేము కూడా వస్తాము. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనితీరు ఏవిధంగా ఉందో తెలుస్తుంది.

MR.SPEAKER: I request you to be brief.

శ్రీ చింతల రామచంద్రారెడ్డి (పీలేరు): ఇవన్నీ వాస్తవాలు అధ్యక్షా. చాలా వాటికి మందుల్లేవు. పాము కరిస్తే మందుల్లేవు. కుక్క కరిస్తే మందుల్లేవు. మంత్రిగారేమో మందులున్నాయని చెప్తున్నారు. చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ప్రభుత్వాసుపత్రుల్లో ఈరోజు మందుల్లేవు. ఇంజక్షన్స్ లేవు. మాత్రలు లేవు. ఇదీ ఈనాటి ఆసుపత్రుల పరిస్థితి.

(మైకు కట్ చేయబడింది.)

మిస్టర్ స్పీకర్: విష్ణుకుమార్ రాజు గారూ....

శ్రీ పి. విష్ణుకుమార్‌రాజు(విశాఖపట్నం-నార్త్): అధ్యక్షా, మీకూ, ఈసభకీ, అందరికీ నమస్కారం తెలుపుతున్నాను. ఈరోజు ప్రభుత్వాసుపత్రులకు వెళ్ళాలంటే ప్రతీ ఒక్కరు భయపడిపోతున్నారు. ప్రభుత్వాసుపత్రులు నేడు జబ్బుపడిపోయాయి. చాలా ఘోరమైన పరిస్థితి ఉంది. స్టాఫ్ లేరు. ప్రశ్నలో డాక్టర్స్ ఎంప్లాయ్‌మెంట్ గురించి వ్రాశారు. కానీ, స్టాఫ్ నర్సుల గురించి ప్రస్తావన లేదు. మేము విశాఖపట్నం వాస్తవ్యులం. విశాఖపట్నంలో కె.జి.హెచ్. హాస్పిటల్ చాలా పెద్ద హాస్పిటల్. అక్కడ స్టాఫ్ నర్సెస్, హెడ్ నర్సెస్ 1419 మంది షార్ట్‌ఫాల్ ఉంది. ఇంత షార్ట్‌ఫాల్ ఉన్నప్పుడు నర్సెస్ లేకుండా కేవలం డాక్టర్స్ మాత్రం ఎంతమందికి న్యాయం చేయగలరు? కాబట్టి, ఈవిషయమై ప్రభుత్వం, గౌరవ మంత్రివర్యులు ఇమ్మీడియట్‌గా చర్యలు తీసుకుని, కావలసిన స్ట్రెంక్త్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు ఈ ప్రభుత్వాసుపత్రుల మీద విశ్వసనీయత కలిగించాలని కోరుతున్నాను. వైద్యం చాలా ముఖ్యమైనది. సరిపడా స్టాఫ్ లేకుండా చేయాలనుకోవడం అవివేకం. కాబట్టి, వెంటనే ఒక కమిటీ వేసి, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఎంత షార్ట్‌ఫాల్ ఉందన్న విషయం ఎంక్వైరీ చేసి, ఈ షార్ట్‌ఫాల్‌ను ఎప్పటిలోగా ఫుల్‌ఫిల్ చేస్తారో తెలియజెప్పాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉంది.

మిస్టర్ స్పీకర్: మినిస్టర్ ఫర్ హెల్త్...

శ్రీ కామినేని శ్రీనివాస్(కైకలూరు): అధ్యక్షా, గత కొద్దికాలంగా ఆరోగ్యశ్రీ పెట్టిన తరువాత పేద ప్రజలకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందుబాటులోకి వచ్చింది. కానీ, ఈ ప్రాసెస్‌లో ప్రైమరీ హెల్త్ సెంటర్స్ నెగ్లెక్ట్ చేయబడ్డాయి. దానిని ఇంప్రూవ్ చేయవలసిన అవసరముంది. అదేవిధంగా ఆరోగ్యశ్రీలో 936 జబ్బులకు మాత్రం ట్రీట్‌మెంట్ ఉంటే, మరొక వంద జబ్బులను అదనంగా జతపరచి, 'రాజీవ్ ఆరోగ్యశ్రీ'ని 'ఎన్టీఆర్ ఆరోగ్య సేవ' గా పేరు మార్చడం జరిగింది.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు అభ్యంతరం తెలియజేయసాగారు)

శ్రీ కామినేని శ్రీనివాస్ (కైకలూరు): అన్నా ఎందుకు? మన రాష్ట్రాన్ని ఇబ్బందులు పెట్టిన ఆ పేర్లెందుకు? తెలుగు జాతికి గౌరవం తెచ్చిన అన్నగారి పేరును పెట్టుకుందాం. దయచేసి వదిలేయండి.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు అభ్యంతరం తెలియజేయసాగారు)

శ్రీ కామినేని శ్రీనివాస్(కైకలూరు): దయచేసి వదిలేయండి. మన రాష్ట్రాన్ని విడగొట్టడంలో..

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే అంతరాయం)

MR.SPEAKER: Yes. Please conclude..

(గౌరవ ప్రతిపక్ష నాయకుడు తమకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వవలసిందిగా కోరసాగారు)

Yes. Leader of the Opposition.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల): అధ్యక్షా, గౌరవ మంత్రిగారికి ఒక క్లారిఫికేషన్ తెలియాలి. స్వర్గీయ శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిగారు ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకంలో గవర్నమెంట్ హాస్పిటల్‌కు మంచి జరిగిందనే విషయం ఒక్కసారి తెలియజేయాలి.

(అధికారపక్ష సభ్యులచే అంతరాయం)

వినండి. ఒక్కసారి వినండి. వినడానికి ఓపిక లేకపోతే ఎలా? ఒక్కసారి వినండి. ఏ పేషెంట్ అయినా కూడా గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళితే, ఆ పేషెంట్ ద్వారా వచ్చే సొమ్ములో 65శాతం అదే గవర్నమెంట్ హాస్పిటల్‌లో మరమ్మత్తులకు, అవసరమైన పరికరాలు కొనేందుకు, ఆ హాస్పిటల్ కోసమే కేటాయిస్తారు. కేవలం 35 శాతం మాత్రమే వాళ్ళు చేసిన సేవకు డాక్టర్లు తీసుకుంటారు. ఇది కావాలంటే మీరు వెరిఫై చేసుకోండి. దానిలో ఏమైనా తప్పుంటే మీరు మాట్లాడండి. మీకు తెలియాల్సిన అవసరముంది. స్వర్గీయ శ్రీ వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకంలో పేదవాడు కార్పొరేట్ హాస్పిటల్‌లో గర్వంగా వైద్యం చేయించుకునే పరిస్థితి కూడా ఉండింది. రెండూ జరిగాయి. (మైకు ఆపు చేయబడింది.)

...

MR.SPEAKER: As a Doctor, I know that 70% of the Arogyasri patients are treated by the Corporate and Private Hospitals. It is an established fact. So, 70 to 80% benefit went to private hospitals. As a Doctor, I am only telling you the truth, but not criticizing anybody.

డా. కామినేని శ్రీనివాస్ (కైకలూరు)ః ప్రభుత్వ వైద్యశాలలో ఇచ్చే ఆరోగ్యశ్రీ డబ్బులో 20 శాతం రివాల్వింగ్ ఫండ్‌కి, 35 శాతం డాక్టర్లకు, పారామెడికల్స్‌కు, 45 శాతం వైద్యశాల అభివృద్ధి ఫండ్‌కు వెళుతుంది. యూజర్ చార్జీలు పెంచే అలోచనే మా ప్రభుత్వానికి లేదు.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి సభకు అంతరాయం)

MR.SPEAKER: Let him complete the answer.

డా. కామినేని శ్రీనివాస్ (కైకలూరు)ః మా ప్రభుత్వం 75 రోజుల్లో 9 జిల్లాలలో సమీక్షించి డాక్టర్లకు మా ప్రభుత్వ ఉద్దేశం స్పష్టంగా చెప్పాం. వైద్యవ్యవస్థ పేషంట్ ఓరియంటెడ్‌గా ఉండాలని, వచ్చిన రోగిని ప్రేమగా, అప్యాయంగా పలకరించాలని, పారిశుద్ధ్యంలో ప్రభుత్వం ఎక్కడా వెనుకాడదని తెలియజేస్తున్నాను. డాక్టర్లు ఉదయం 9.00గం. నుంచి సాయంత్రం 4.00గం. వరకు తప్పకుండా ఉండాలని, బయోమెట్రిక్ సిస్టమ్, ట్రాకింగ్ సిస్టం ద్వారా హాజరు ఉంటుందని, అందరినీ హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలని చెప్పాం. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల సిస్టంలో లోపాలున్నాయి. గౌరవసభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని వాటిని మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను. (అధికారపార్టీ పక్ష సభ్యులు బల్లలు చరిచడం ద్వారా తమ హర్షాతిరేకాలను వ్యక్తపరిచారు).

**MR.SPEAKER: Question No.80 (20), Minister for Endowments**

**ప్రశ్న నెం .80 (20)**

**సర్వశ్రీ శ్రీరాం రాజగోపాల్ (జగ్గయ్యపేట) – ఎమ్మెల్యే**

అ) జగ్గయ్యపేటలో తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపాన్ని నిర్మించడానికి ఏదైనా ప్రతిపాదన ఉన్నదా ;

ఆ) అయితే, దాని కోసం ఏదైనా భూమిన కేటాయించడమయిందా ; ఎప్పటిలోగా నిర్మాణాన్ని ప్రారంభిస్తారు?

**దేవాదాయ శాఖ మంత్రి (శ్రీ పైడికొండల మాణిక్యాలరావు (తాడేపల్లిగూడెం) )ః**

అ) అవునండీ.

ఆ) కళ్యాణ మండపం నిర్మాణం కోసం మొదట జగ్గయ్యపేట సర్వే నంబరు 337/1లో గల ఒక ఎకరం విస్తీర్ణం మేరకు భూమిని కేటాయించాలని ప్రతిపాదించడమయింది. అయితే,

వెడల్పు తక్కువగా ఉన్నందున కళ్యాణ మండపాన్ని నిర్మించడానికి అనువైనదిగా గుర్తించలేదు. అనువైన భూమి లభ్యమైన మీదట నిర్మాణం చేపట్టమవుతుంది.

శ్రీ శ్రీరాం రాజగోపాల్(జగ్గయ్యపేట) : అధ్యక్షా, నా నియోజకవర్గం జగ్గయ్యపేటలో 2008వ సంవత్సరంలో శంకుస్థాపన చేసిన కళ్యాణమండపం ఇప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఇప్పుడు అడిగితే స్థలం వెడల్పు సరిపోలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని గతంలోనే చెప్పి ఉంటే బాగుండేది. ఇప్పటికైనా కళ్యాణమండపానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని చూడటం మంచిదని భావిస్తున్నాను. దానికోసం కొంతమంది దాతలు, మా బంధువులు కొంత మొత్తాన్ని ప్రోగుచేసి, స్థలాన్ని కొనుగోలు చేసి, దేవస్థానానికి రిజిస్ట్రేషన్ చేశారు. దానిని అదే కమిటీకి ఇచ్చి వేరే ప్రత్యామ్నాయ స్థలాన్ని చూసి కళ్యాణమండపాన్ని పూర్తిచేయాల్సిందిగా కోరుతున్నాను. సామాన్య ప్రజలు కళ్యాణమండపాలకు రూ.50,000/- నుంచి రూ.1,00,000/-ల దాకా ఖర్చు భరించాలంటే చాలా కష్టం. ఈ కళ్యాణమండపం పూర్తి అయితే ప్రజలు చాలా సంతోషిస్తారు.

నా నియోజకవర్గంలో తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి, వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల దగ్గర చాలా స్థలాలు ఉన్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా అక్కడ కూడా కళ్యాణమండపాలను నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. సంబంధిత అధికారులు జగ్గయ్యపేటకు వచ్చి కమిటీతో చర్చించి ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ఆ స్థలాన్ని మరలా రిజిస్ట్రేషన్ చేయడమో, లేదా వేరే స్థలం కొనుగోలు చేయడమో చేయాలని మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పైడికొండల మాణిక్యాలరావు(తాడేపల్లిగూడెం): గౌరవసభ్యులు సూచించినట్లుగా, తప్పనిసరిగా కళ్యాణమండపం కొలతలకు సరిపడేటట్లు స్థలాన్ని ప్రతిపాదిస్తే నిర్మాణం చేపడుతాం. సంబంధిత అధికారులను జగ్గయ్యపేటకు పంపించి, వారితో చర్చించి తగిన స్థలాన్ని సూచించవలసిందిగా కోరుతాం.

**MR.SPEAKER: The decisions arrived at during the Yesterday's BAC Meeting are placed on the Table.**

## DECISIONS OF THE BUSINESS ADVISORY COMMITTEE TAKEN AT ITS MEETING HELD ON 18.08.2014

| | |
|---|---|
| 19.08.2014<br>(TUESDAY) | Government Business |
| 20.08.2014 | Presentation of Budget for 2014-2015. |

| | |
|---|---|
| (WEDNESDAY) | |
| 21.08.2014 (THURSDAY) | -NO SITTING- |
| 22.08.2014 (FRIDAY) | 1.Presentation of Agriculture and allied Sectors Budget for 2014-15.<br>2. First day of General Discussion on Budget for 2014-2015. |
| 23.08.2014 (SATURDAY) | Second day of General Discussion on Budget for 2014-2015. |
| 24.08.2014 (SUNDAY) | -HOLIDAY- |
| 25.08.2014 (MONDAY) | Third day of General Discussion on Budget for 2014-2015. |
| 26.08.2014 (TUESDAY) | 1. Fourth and last day of General Discussion on Budget for 2014-2015.<br>2. Reply by the Minister for Finance and Legislative Affairs on General Discussion on Budget for 2014-2015. |
| 27.08.2014 (WEDNESDAY) | First day of Voting of Demands for Grants for 2014-15. |
| 28.08.2014 (THURSDAY) | Second day of Voting of Demands for Grants for 2014-15. |
| 29.08.2014 (FRIDAY) | -HOLIDAY<br>(VINAYAKA CHATHURTHI) |
| 30.08.2014 (SATURDAY) | Third day of Voting of Demands for Grants for 2014-15. |
| 31.08.2014 (SUNDAY) | -HOLIDAY- |
| 01.09.2014 (MONDAY) | Fourth day of Voting of Demands for Grants for 2014-15. |

| | |
|---|---|
| 02.09.2014 (TUESDAY) | Fifth day of Voting of Demands for Grants for 2014-15. |
| 03.09.2014 (WEDNESDAY) | Sixth day of Voting of Demands for Grants for 2014-15. |
| 04.09.2014 (THURSDAY) | Seventh day of Voting of Demands for Grants for 2014-15 |
| 05.09.2014 (FRIDAY) | Eighth and last day of Voting of Demands for Grants for 2014-2015. |
| 06.09.2014 Bill, (SATURDAY) | The Andhra Pradesh Appropriation 2014. |

**MR. SPEAKER :I have an announcement to make.**

**ANNOUNCEMENT**

"I am to announce to the House that I have nominated the following Members to be on the Panel Chairmen for the Second Session of the AP Legislative Assembly.

1. **Sri G.Syam Sunder Sivaji**
2. **Sri Gorantla Buchayya Chowdary**
3. **Sri K.Venkata Rao**
4. **Sri Nakka Ananda Babu**
5. **Sri Gadikota Srikanth Reddy**
6. **Smt.D.A. Satya Prabha."**

**Now, Zero Hour.**

జీరో అవర్

శ్రీ బి.జయనాగేశ్వర్ రెడ్డి (ఎమ్మిగనూరు)ః అధ్యక్షా, పద్మశ్రీ మాచాని సోమప్ప పేరు మీద ఉన్న 'ఎమ్మిగనూరు వీవర్స్ కోఆపరేటివ్ సొసైటి' చేనేత కార్మికులకు ఎంతో మేలు చేసింది. దాదాపు 2222 చేనేత కార్మికులకు సొసైటీలో సభ్యులుగా ఉన్నారు. బైలాస్‌లో ఉన్న లొసుగులతో కుట్రపూరితంగా దాదాపు 1450 మందిని చేనేత కార్మికులను సొసైటీ నుంచి తొలగించారు. ఈ సొసైటీలో ఉన్న బాడీపై తక్షణమే ప్రభుత్వం వాటిపై విచారణ జరిపేందుకు ఒక కమిటీని వేసి చర్యలు తీసుకొని, తొలగించడిన చేనేత కార్మికుల రక్షణకు తగిన చర్యలు తీసుకోవల్సిందిగా గౌరవ మంత్రివర్యులను, ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి (పుట్టపర్తి)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాలు నోట్ చేసుకున్నాం. దానిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది.

శ్రీ వై.సాయిప్రసాద్ రెడ్డి (ఆదోని)ః అధ్యక్షా, నా నియోజకవర్గంలో ప్రధానంగా మూడు సమస్యలున్నాయి. మొదటిది త్రాగునీటి సమస్య, రెండవది ట్రాఫిక్ సమస్య, మూడవది సాగునీటి సమస్య. 2004 నుంచి 2009 మధ్య స్వర్గీయ శ్రీ రాజశేఖర్ రెడ్డి సహకారంతో మునిసిపాలిటీలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటుచేసినా కూడా త్రాగునీటికి ఇబ్బందికర పరిస్థితి ఉంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. తాగునీటి సరఫరాకు పైప్‌లైన్స్‌లో లీకేజీలు ఉన్నాయంటున్నారు. వీటిపై వెంటనే ప్రభుత్వం స్పందించాలి. గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి ఉంది. పెద్దతుంబలం గ్రామంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేసినా పైప్‌లైన్ వేయలేదు. వాటిపై కూడ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

గతంలో నా నియోజకవర్గంలో స్వర్గీయ శ్రీ రాజశేఖర్ రెడ్డి బైపాస్ రోడ్డును మంజూరు చేశారు. ఇంతవరకు అది పూర్తి కాలేదు. వాటికి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడు(నర్సీపట్నం)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాలు నోట్ చేసుకున్నాం. వాటిపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటాము.

...

శ్రీ పి.శ్రీనివాసుల రెడ్డి(కోవూరు)ః సర్, నేను ప్రస్తావిస్తున్నది ఆర్ అండ్ బికి సంబంధించినది. నెల్లూరు మునిసిపల్ కార్పోరేషన్‌కు కూతవేటు దూరంలో వున్న మా కోవూరు నియోజకవర్గంలో రహదారులు అతి దారుణంగా వున్నాయి. రహదారులు అభివృద్ధికి, ప్రగతికి చిహ్నాలు అని భావిస్తున్న నేటి ఆధునిక కాలంలో మా కోవూరు నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితి గురించి నేను ఆర్ అండ్ బి మంత్రి గారి దృష్టికి తీసుకురాదలచాను. డెల్టా

ప్రాంతమైన మా నియోజకవర్గంలోని రోడ్ల కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులెదుర్కొంటున్న పరిస్థితి వుంది. అన్ని కూడా కేవలం సింగిల్ రోడ్లే. వాటినన్నిటినీ వైడెనింగ్ చేయాల్సిన అవసరమున్నది. నేను ఈ సందర్భంగా గౌరవ మంత్రి గారి దృష్టికి తీసుకురాదలచుకున్నదేమంటే ఇటీవల మా జిల్లాలోని ఆర్ అండ్ బి ఎస్ఈ గారు ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రు. 600 కోట్ల ఖర్చుతో జిల్లాలోని ఆర్ అండ్ బి రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పడం జరిగింది. అయితే ఆ డబ్బును కేవలం ఒక ప్రాంతంలోనే ఖర్చు పెట్టారని, నా నియోజకవర్గంలో గత ఐదు సంవత్సరాల కాలంలో కనీసం రు. పది లక్షల విలువైన పనులను కూడా చేపట్టలేదని, కనీసం మెయింటెనెన్స్ కోసం కూడా ఖర్చు పెట్టలేదన్న విషయాన్ని మీ ద్వారా మంత్రి గారి దృష్టికి తీసుకొస్తున్నాను. అందువలన ఆ రు. 600 కోట్ల ఖర్చుతో జిల్లాలోని ఎక్కడెక్కడ రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారో దయచేసి ఒకసారి సమీక్షించాలని గౌరవ ఆర్ అండ్ బి మంత్రి గారిని మీ ద్వారా కోరుతున్నాను.

అట్లాగే గతంలో నా నియోజకవర్గంలోని ఇనమడుగు, ముదివర్తి రోడ్డును వైడెనింగ్ చేయాలన్న పనులకు సంబంధించిన టెండర్లను పిలిచినప్పటికీ అవి కొన్ని కారణాల వల్ల ఆగిపోవడం జరిగింది. వాటిని వెంటనే చేపట్టాలని నేను మంత్రి గారిని కోరుతున్నాను. అదేవిధంగా నా నియోజకవర్గంలో వున్న సింగిల్ రోడ్లన్నిటివద్దా తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టు కొని వెంటనే వాటిని వైడెనింగ్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మీ ద్వా రా గౌరవ మత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ సిహెచ్ అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం): అధ్యక్షా, గౌరవ సభ్యులు ప్రస్తావించిన అంశాన్ని గౌ. ఆర్ అండ్‌బి. మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుంది.

శ్రీ టి. జయరాములు(బద్వేల్): అధ్యక్షా, రెండు విషయాలను తమరి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకురాదలచుకున్నాను. గత 50 సంవత్సరాల నుంచి మా వాల్మీకి కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని మా కులస్తులు డిమాండు చేయడం జరుగుతున్నది. పోరాటాలు చేయడం జరుగుతన్నది. అయితే దురదృష్టవశాత్తూ మన రాష్ట్రంలో ఆ డిమాండు ఇంతవరకు నెరవేరలేదు. పక్కనున్న కర్నాటక రాష్ట్రంలో వాల్మీకులను ఎస్టీల జాబితాలో చేర్చారు. అట్లాగే మన పక్కనున్న ఒరిస్సా రాష్ట్రంలో కూడా ఎస్టీలుగా గుర్తించినందున దానినానుకొని వున్న మన శ్రీకాకుళం జిల్లాలో కొన్ని కొన్ని ఒరియా తెగలకు చెందిన వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించడం జరిగింది. మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు వాల్మీకులను మన రాష్ట్రంలో కూడా ఎస్టీలుగా గుర్తిస్తామని చెప్పడం జరిగింది. అందువలన మన రాష్ట్రంలోని వాల్మీకులను కూడా ఎస్టీలుగా గుర్తించాలని నేను మీ ద్వారా ముఖ్యమంత్రి గారిని ఈ సందర్భంగా కోరుతున్నాను.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి (పుట్టపర్తి)ః సర్, సభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుంది.

శ్రీ ఎమ్.సునీల్ కుమార్ (పూతలపట్టు)ః అధ్యక్షా, జీరో అవర్‌లో నాకు అవకాశమిచ్చినందుకు తమరికి ధన్యవాదాలు. మా బంగారుపాళ్యం నియోజకవర్గానికి అత్యంత ప్రాముఖ్యత వుంది. ఇది అటు కర్నాటక ఇటు తమిళనాడు రెండు రాష్ట్రాల సరిహద్దులకు దగ్గరగా వుంది. అటు చైన్నైకి 120 కిలోమీటర్ల దూరంలోనూ, ఇటు కర్నాటక రాష్ట్ర రాజధాని నగరమైన బెంగళూరుకు 160 కిలోమీటర్ల దూరంలోనూ వుండడమే కాక అటు తిరుమల తిరుపతి దేవస్థానానికి, ఇటు కాణిపాకం దేవస్థానానికి కూడా ఈ మార్గం ద్వారా వెళ్లాల్సి వుంటుంది. మా చిత్తూరు జిల్లాలోని పలమనేరు నియోజక వర్గంలోనూ, మదనపల్లి నియోజకవర్గంలోనూ ఎక్కువగా పండించే టమోటాను పక్కనున్న రాష్ట్రాలలోని రాజధాని నగరాలకు తరలించడానికి మా నియోజకవర్గం ద్వారానే రవాణా చేయవలసివుంటుంది. అట్లాగే మా చిత్తూరు జిల్లా ఎక్కువగా డెయిరీ పరిశ్రమ మీద ఆధారపడి వున్నది. జిల్లాలోని డెయిరీ వుత్పత్తులను ప్రతినిత్యం చైన్నై మరియు బెంగళూరు నగరాలకు ఎగుమతి చేస్తుంటారు. ముఖ్యంగా నా నియోజకవర్గంలో ఘాట్ రోడ్లు ఎక్కువగా వున్న కారణంగా ఈ మార్గం గుండా డెయిరీ ఉత్పత్తులను కాని, టమోటా తదితర ఉత్పత్తులను కాని ప్రతి రోజూ రవాణ చేయడం వల్ల వారంలో కనీసం మూడు రెండు మూడు రహదారి ప్రమాదాలు సర్వసాధారణంగా జరుగుతుంటాయి. ఇటువంటి ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వంలో ఈ రోడ్డు మార్గాన్ని ఎన్‌హెచ్ 4 కింద నాలుగులేన్ల రోడ్డుగా నిర్మించడానికి సర్వేలు చేసి ప్రతిపాదనలు రూపొందించడం జరిగింది. కానీ, ఎందుకనో అవి కార్యరూపం దాల్చలేదు. కాబట్టి దానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏమయ్యాయి? వాటికి ఏమైనా బడ్జెట్ కేటాయించారా తెలియజెయ్యాలని నేను తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ సిహెచ్ అయ్యన్నపాత్రుడు(నర్సీపట్నం)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారి దృష్టికి ఆ విషయాన్ని తీసుకువెళ్లడం జరుగుతుంది.

శ్రీ జి.సూర్యనారాయణ(ధర్మవరం)ః అధ్యక్షా, దేశంలోనే రాజస్తాన్ లోని జైసల్మేర్ తరువాత అతి తక్కువ వర్షపాతం వుండే జిల్లాలలో అనంతపురం జిల్లా ఒకటి. ఈ జిల్లాకు హెచ్ఎల్‌సి ద్వారా కాని, జిఎన్‌హెచ్ఎస్ ద్వారా కాని జిల్లాలో ఎండిపోయిన చెరువులన్నింటినీ నింపాలన్నది మా డిమాండు. అట్లాగే జిల్లాలో రైతులంతా చాలా వెనుకబడిపోయారు. వాళ్ల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఏదెనా ప్యాకేజి ప్రకటించాలన్నది మా డిమాండు. అట్లాగే రాష్ట్రంలోని చేనేతకారుల సంక్షేమాన్ని ముఖ్యంగా మా ధర్మవరం నియోజకవర్గంలో చేనేత కారులు చాలా మంది వున్నారు. వారంతా చాలా దీన పరిస్థితిలో వున్నారు వారి అభివృద్ధి కోసం కొన్ని చర్యలు

తీసుకోవలసిన అవసరమున్నది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు చైనా నుంచి దిగుమతి చేసుకునే శిల్కుకు దిగుమతి సుంకం ఐదు శాతంమాత్రమే వుండేది. 33 మంది ఎమ్‌పీలను మన రాష్ట్రం నుంచి పంపించినప్పుడు అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ అధికారంలో వున్న ఒకే పార్టీ ప్రభుత్వం ఆ సుంకాన్ని 15 శాతానికి పెంచడం జరిగినందువల్ల చేనేతకారులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పుడు మరల తెలుగుదేశం ప్రభుత్వం వచ్చింది. కాబట్టి మరల ఆ పన్నును ఐదు శాతానికి తగ్గించాలని నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాను. అట్లాగే చేనేతకారులకు ప్రత్యేకంగా ఒక బ్యాంకును ఏర్పాటు చేసి చేనేతకారులకు ఉదారంగా లోన్లు ఇప్పించి వాళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. అట్లాగే చేనేతకారుల కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు తీసుకొచ్చి రు. 200 కోట్లతో ఒక మెగా క్లస్టర్‌ను ఏర్పాటు చేయవలసిందిగా మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా, సభ్యులు ప్రస్తావించిన విషయాలను నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారి దృష్టికి ఆ విషయాలను తీసికెళ్లడం జరుగుతుంది.

శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డి (కర్నూలు): అధ్యక్షా, కర్నూలులో వెయ్యి పడకలతో అతి ప్రతిష్టాత్మకమైన ఆసుపత్రి వుంది. ఆ ఆసుపత్రికి కర్నూలు చుట్టుపక్కనున్న అనంతపురం, కడప, చిత్తూరు, మహబూబ్‌నగర్ బళ్లారి తదితర ఐదు జిల్లాల నుంచి పేషంట్లు వస్తుంటారు. అక్కడి భవనాలు దాదాపు 70 ఏళ్ల క్రితం కట్టబడినవి. అవి ఏ క్షణంలో అయినా పడిపోయే పరిస్థితి వుంది. అక్కడి ఆసుపత్రి పరికరాలు కూడా చాలా పాతపడిపోయాయి. ఆ ఆసుపత్రి అభివృద్ధి నిమిత్తం రు. 250 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు తయారు చేసి మొన్న గౌరవ ముఖ్యమంత్రి గారు కర్నూలు వచ్చినప్పుడు అందజేయడం జరిగింది. అట్లాగే కేంద్ర మంత్రివర్యులు శ్రీ వెంకయ్యానాయుడు గారికి కూడా వాటిని అందజేయడం జరిగింది. వాటిని రాష్ట్ర ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి గారికి పంపించడం జరిగిందని ఆయన నుంచి మాకు ఒక లెటర్ కూడా వచ్చింది. పై పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కర్నూలు ఆసుపత్రి అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవలని, తద్వారా చుట్టుపక్కలవున్న ఐదు జిల్లాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని నేను మీ ద్వారా సంబంధిత మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుంది.

...

శ్రీ ఎస్.బి.అంజాద్ బాషా(కడప): అధ్యక్షా, ఈ రోజు పద్నాలుగవ శాసనసభలో నాకు మాట్లాడే అవకాశం కల్పించిన నా కడప నియోజకవర్గ ప్రజలందరికీ నేను సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. కడప నియోజకవర్గంలో ముస్లింలు ఎక్కువగా ఉన్నారు కాబట్టి కొన్ని ఉర్దూ మీడియం పాఠశాలలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించి 9 ఎలిమెంటరీ

పాఠశాలలను 2002-03లో మంజూరు చేసింది. అదే విధంగా మూడు ఎలిమెంటరీ తెలుగు పాఠశాలలను కూడా మంజూరు చేసింది. మూడు ఎలిమెంటరీ పాఠశాలలను అప్పర్ ప్రైమరీ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. కొత్త పాఠశాలలు వచ్చాయి, కొన్ని పాఠశాలలు అప్‌గ్రేడ్ అయ్యాయి గానీ ఆ పాఠశాలలకు మంజూరైన ఉపాధ్యాయ పోస్టులు లేవు. తొమ్మిది ఉర్దూ మీడియం ఎలిమెంటరీ పాఠశాలలకు 24 పోస్టులు, తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాలలకు ఆరు పోస్టులు మంజూరు చేయాలి. అదే విధంగా అప్‌గ్రేడ్ చేసిన మూడు అప్పర్ ప్రైమరీ పాఠశాలలకు 15 పోస్టులు మంజూరు చేయాల్సిన అవసరముంది. ఈ సభా ముఖంగా మంత్రివర్యులకు, ప్రభుత్వానికి కోరేదేమంటే, డిఎస్‌సి 2014లో ఆయా పాఠశాలలలోని పోస్టులను కూడా కలిపి భర్తీ చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయం నోట్ చేసుకున్నాను. తగిన చర్యలు తీసుకుంటాం.

శ్రీ బి.కె.పార్థసారథి (పెనుకొండ): అధ్యక్షా, పెనుగొండ నియోజకవర్గం పెనుకొండ మండలం పరిధిలో శెట్టిపల్లి అనే కుగ్రామం ఉంది. మండల కేంద్రానికి ఆ గ్రామానికి మధ్య ఒక నది ప్రవహిస్తుంది. ఆ నదిపై వంతెన లేకపోవడం వల్ల శెట్టిపల్లి గ్రామంతోబాటు సుమారు 20 నుంచి 25 గ్రామాలకు వెళ్లడానికి వర్షాకాలంలో చాలా ఇబ్బందికర పరిస్థితులున్నాయి. కావున ఆ నదిపై వంతెన నిర్మిస్తే ఆ గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఏర్పడుతుంది కాబట్టి వంతెన నిర్మించాలని మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం): అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పినది నోట్ చేసుకున్నాను. తగు చర్యలు తీసుకుంటాను.

MR.SPEAKER: Now tea-break for 15 minutes.

**(The House then adjourned at 11-13 AM for tea break for 15 minutes)**

•••

**(టీ విరామానంతరం సభ తిరిగి ఉ.11.34 గం.లకు సమావేశమైంది గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో వున్నారు)**

•••

**మిస్టర్ స్పీకర్: సంతాప తీర్మానాలు.**

## సంతాప తీర్మానాలు

1) ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ సభ్యులు శ్రీ సంగీత వెంకట రెడ్డి గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తున్నది. శ్రీ సంగీత వెంకట రెడ్డి గారు 1967 – 1972 కాలంలో తూర్పు గోదావరి జిల్లా పామర్రు మరియు 1978–1983, 1989–1994 సంవత్సరాల్లో ఆలమూరు నియోజక వర్గం నుంచి మొత్తం మూడు సార్లు ప్రాతినిధ్యం వహించారు. వీరు డా.జనార్థన్‌రెడ్డి గారి మంత్రి వర్గంలో పశుసంవర్ధక మరియు మత్స్యశాఖ మంత్రిగా పనిచేశారు. వీరు తమ నియోజక వర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరు 2014 సంవత్సరం, జూన్ 23వ తేదీన స్వర్గస్తులైనారు.

2) ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ సభ్యులు శ్రీ చప్పిడి వెంగయ్య గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేసుకుంటున్నది. శ్రీ చప్పిడి వెంగయ్య గారు 1967–1972, 1994–1999 సంవత్సరాల్లో రెండు సార్లు ప్రకాశం జిల్లా కంభం శాసన సభ నియోజక వర్గం నుంచి ప్రాతినధ్యం వహించారు. వీరు 1985, 1986 సంవత్సరాల కాలంలో ప్రకాశం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా బాధ్యత నిర్వహించారు. వీరు తమ నియోజక వర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరు తేది 20.07.2014 న స్వర్గస్తులైనారు.

3) ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ సభ్యులు శ్రీ కోళ్ల అప్పలనాయుడు గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ఈ సభ తన ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నది. శ్రీ కోళ్ల అప్పలనాయుడు గారు 1962–1967, 1967–1971, 1983–1984, 1985–89, 1989–94, 1994–99 మరియు 1999–2003 సంవత్సరాల కాలంలో మొత్తం 7 సార్లు విజయనగరం జిల్లా ఉత్తరాపల్లి శాసన సభ నియోజక వర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. వీరు 1984–1985 సంవత్సరాల్లో శ్రీ ఎన్‌టి రామారావు గారి మంత్రి వర్గంలో దేవాదాయ శాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. వీరు 11వ శాసన సభకు ప్రొటెం స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. వీరు తమ నియోజక వర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీయ 2014వ సంవత్సరం, ఆగష్టు 10వ తేదీన మరణించారు. వీరి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటిద్దాం.

**(సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది)**

MR.SPEAKER: Now, statement by the Hon'ble Chief Minister.

(ఈ సందర్భంలో వైఎస్ఆర్‌సిపి సభ్యులు తమ స్థానంలో నిలబడ్డారు)

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి  (రాయచోటి): (మైకు లేకుండా) సార్, నిన్న నోటీస్ ఇచ్చాము.

మిస్టర్ స్పీకర్: మీరు నిన్న సాయంత్రం ఇచ్చారు. రేపటికి పోస్ట్ చేయడం జరిగింది.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి (రాయచోటి): (మైకు లేకుండా) రేపు బడ్జెట్ ప్రవేశ పెడుతున్నారు కదా?

మిస్టర్ స్పీకర్: బిజినెస్ ప్రతీ రోజూ ఉంటుంది. ప్రభుత్వానికి మెటీరియల్ సమకూర్చుకునే సమయమివ్వాలి. వారు సమాధానం చెప్పడానికి తగిన సమయం ఇవ్వాలి. మీరు నిన్న సాయంత్రం ఇచ్చారు నేను రేపటికి పోస్ట్ చేసాను.

(ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

Please do not make an issue. రేపు బడ్జెట్ ఉన్నా మిగతా బిజినెస్ కూడా ఉంటుంది. మీరు ఇచ్చిన 344 నోటీస్ వచ్చింది. రేపటికి పోస్ట్‌చేసాను.

శ్రీ జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట): (మైకు లేకుండా) రేపు టీ బ్రేక్ లేకుండా ఆ అంశాన్ని తీసుకుందామని నిన్న చెప్పారు.

మిస్టర్ స్పీకర్: మీరు దయచేసి ఇస్యూ లేనిచోట ఇస్యూ చేయకండి. 344 నోటీస్ వచ్చింది. రేపటికి పోస్ట్ చేశాను.

(అంతరాయం)

...

శ్రీ భూమా నాగిరెడ్డి (నంద్యాల)(మైక్ లేకుండా): ఇష్యూ ఉండబట్టే నోటీసు ఇవ్వడం జరిగింది సార్.

(ఈ దశలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు తమ స్థానాలను విడచి వెల్‌లోకి వచ్చారు)

మిస్టర్ స్పీకర్ : 344 మీద పోస్ట్ చేశామంటే..  (అంతరాయం)  లా అండ్ ఆర్డర్ మీద మీరు నోటీసు ఇచ్చారు, అది అందరికీ ముఖ్యమైన అంశమే.

(వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వెల్‌లో నిలబడి 'వుయ్ వాంట్ జస్టిస్.. వుయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేయసాగారు)

రేపటికి పోస్ట్ చేశామన్న తర్వాత కూడా ఈ విధంగా డిస్టర్బ్ చేయడం కరెక్ట్ కాదు. దయచేసి కూర్చోండి. (అంతరాయం) You have to do justice to the subject. రేపు అవకాశం ఇస్తామని లిస్టులో పొందుపరచిన తర్వాత.. మీ స్థానాలకు వెళ్లి కూర్చోకుండా ఈ విధంగా సభను డిస్టర్బ్ చేయడం.. మీకే నష్టం. Please co-operate and withdraw from the well.

శ్రీ భూమా నాగిరెడ్డి (నంద్యాల) : (మైక్ లేకుండా) మా బాధలను మీకే కదా సార్ చెప్పుకోవాల్సింది. నిన్న ఇక్కడ చర్చ జరిగే సందర్భంలోనే నర్సరావుపేటలో దాడులు జరిగాయి సార్.

మిస్టర్ స్పీకర్ : రూల్ 344 క్రింద పోస్ట్ చేసిన తర్వాత దాని గురించి ఇష్యూ చేయడం కరెక్ట్ కాదండీ.

శ్రీ భూమా నాగిరెడ్డి (నంద్యాల): (మైక్ లేకుండా) క్వశ్చన్ అవర్ అవుతూనే టైమ్ ఉంటుంది టేకప్ చేస్తాం అన్నారు సార్.

MR.SPEAKER: Please withdraw from the well.

(వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వెల్‌లో నిలబడి 'వుయ్ వాంట్ జస్టిస్.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి' అంటూ నినాదాలు చేయసాగారు)

మిస్టర్ స్పీకర్ : నేను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాను. మీరిచ్చిన మాటను కూడా నిలబెట్టుకోవాలి. మీ నోటీసు అందిన వెంటనే I sent it to the Government and they also agreed to answer it tomorrow. నేను నా మాటను నిలబెట్టుకున్నాను. మీరు కూడా మీ మాటను నిలబెట్టుకోండి. Now, let us take up the business slated in the agenda. Once again I request you to please withdraw from the Well of the House. Now, Leader of the House would like to speak.

(వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వెల్‌లో నిలబడి 'ఇచ్చిన మాట.. నిలబెట్టుకోవాలి.. ' అంటూ నినాదాలు చేయసాగారు)

మీరు దయచేసి వినండి. The rule is that when the Leader of the House and also the Leader of the Opposition... మాట్లాడాలి అనుకున్నప్పుడు అందరు వెళ్లి వారి స్థానాల్లో కూర్చోవాలి. అది మినిమమ్ కర్టసీ.

(నినాదాలు కొనసాగాయి)

దయచేసి వెళ్లి మీ స్థానాల్లో కోర్చోండి. లీడర్ ఆఫ్ ది హౌస్‌ని మాట్లాడనివ్వండి. (అంతరాయం) దయచేసి కూర్చోండి. దయచేసి కోఆపరేట్ చేయండి. (నినాదాలు కొనసాగాయి) When the Leader of the House wants to speak, You should not interrupt him. దయచేసి కూర్చోవాలి.

(వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వెల్‌లో నిలబడి 'వుయ్ వాంట్ జస్టిస్.. హత్యా రాజకీయాలపై చర్చ జరగాలి.. అంటూ నినాదాలు చేయసాగారు)

(ఈ దశలో అధికార పక్షానికి చెందిన సభ్యులు వారి స్థానాల్లో నిలబడి 'వుయ్ వాంట్ బిజినెస్.. వుయ్ వాంట్ బిజినెస్.. అంటూ నినాదాలు చేయసాగారు)

దయచేసి కూర్చోండి. Please be seated. When the Leader of the House wants to speak, you should not interrupt him. దయచేసి కూర్చోవాలి. It is not fair on your part. Please resume your seats.

(వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వెల్‌లో నిలబడి 'ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి' అంటూ నినాదాలు చేయసాగారు)

మీరు నోటీస్ ఇచ్చారు. దాని ఇంపార్టెన్స్‌ని గమనించి వెంటనే గవర్నమెంటుకు పంపించాము. రేపు పోస్ట్ చేసుకుంటున్నామని చెప్పారు. 24 గంటల్లో ఏమౌతుంది? They are prepared to answer. దాని మీద మీరు మాట్లాడొచ్చు. ప్లీజ్.. దయచేసి కూర్చోండి.

(వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వెల్‌లో నిలబడి 'హత్యా రాజకీయాల పై చర్చ జరగాలి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.. వుయ్ వాంట్ జస్టిస్.. ' అంటూ నినాదాలు చేయసాగారు)

రూల్ 344 క్రింద పోస్ట్ చేశామని చెప్పిన తర్వాత మీరు ఎందుకు వెల్‌లోకి వచ్చారు? దయచేసి చెప్పండి. It is posted for tomorrow. Now, please go back to your seats.

(నినాదాలు కొనసాగాయి)

...

శాంతి భద్రతలకు సంబంధించిన అంశాన్ని రేపటికి పోస్ట్ చేయడం జరిగింది. దయచేసి సహకరించండి. దయచేసి మీ స్థానాలకు వెళ్లి కూర్చోండి. ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ గారు మీరు మాట్లాడండి.

శ్రీ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ (పొన్నూర్): స్పీకర్ సార్, మీరు ఎంతో ఉదారత్వంతో వారిచ్చిన 344 కు సంబంధించిన అంశాన్ని రేపటి ఎజెండాలో తీసుకువస్తామని చెప్పారు. కానీ వారు ఏ విధంగా సభను సజావుగా జరగకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఎందుకంటే అందరూ ఒకసారి ఆలోచన చేయాల్సిన అవసరముంది. చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడి ఈనాటికి అరవై రోజులు కూడా కాలేదు. జగన్మోహన్‌రెడ్డి గారు శాంతిభద్రతల గురించి మాట్లాడుతున్నారు. బయటెక్కడ కూడా లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తడం లేదు. ఒక సమర్ధవంతమైన పరిపాలన నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో నడుస్తుంటే, లేనిపోని అంశాన్ని సభ ముందుకు తీసుకువచ్చి సభ స్థంబించే విధంగా ప్రయత్నం చేస్తున్నారు.

అధ్యక్షా, మాకు ఒక విషయం అర్థం కావడం లేదు. ఇది (పత్రికలో ప్రచురితమైన వార్తను గౌరవ సభాపతి వైపు చూపిస్తూ) జగన్మోహన్ రెడ్డి గారిచ్చిన స్టేట్‌మెంట్. టి.డి.పి. అధికారంలోకి వచ్చిన తరువాత 19 మంది వై.ఎస్.ఆర్. పార్టీ కార్యకర్తలు చనిపోయినారని వారు చెప్పారు. అదే జగన్మోహన్ రెడ్డి గారు ఈ సభలో నిన్న మాట్లాడుతూ 11 మంది వారి పార్టీకి చెందిన కార్యకర్తలు చనిపోయినారని చెప్పడం జరిగింది. అంటే ఏది వాస్తవం. అవాస్తవాలను పోగుచేసి ఈ ప్రభుత్వం మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు.

అధ్యక్షా, ఇవాళ మీ వారసత్వం ఏమిటి? పది సంవత్సరాల అధికారంలో ఆరు సంవత్సరాల కాలం పాటు వారి తండ్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. వారి హయాంలో ఈ రాష్ట్రంలో జరిగిన రాజకీయ హత్యలు ఏవైతే State sponsored హత్యలున్నాయో వాటికి వారు వారసులు కాదా? ఇవాళ మేం వారిని ఒక విషయం అడుగుతున్నాం. ఆనాటి వారి రక్తదాహనికి వందలాది మంది మా పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు బలైనారు. ప్రతిపక్షం ఎందుకు భయపడుతోంది. ప్రజాసమస్యల పట్ల మీకు చిత్తశుద్ధి ఉంటే ముందుకురండి.

అధ్యక్షా, ఇవాళ వాళ్లు దేనికి భయపడుతున్నారు? వారి తండ్రి హయాంలో జరిగిన రాజకీయ హత్యలు ముఖ్యంగా వారి తండ్రి గారు మరియు ప్రస్తుత ప్రతిపక్షనాయకుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని ఎంతో మంది మా పార్టీ కార్యకర్తలు చనిపోయారు. వారి యొక్క రక్తదాహనికి నిలువెత్తు సాక్ష్యమే మా పార్టీ నాయకురాలు శ్రీమతి పరిటాల

సునీతమ్మ. ఇంతకంటే ఏం కావాలి. కళ్లముందు మీ రక్తదాహానికి నిలువెత్తు సాక్ష్యం ఈ సభలో కనబడుతుంటే, ఇంకా ఏ మొహం పెట్టుకుని శాంతి భద్రతల గురించి మాట్లాడతారు? గత మీ చరిత్ర ఏమిటి? మీ కుటుంబ చరిత్రేమిటి? స్వర్గీయ రాజారెడ్డి గారు కావచ్చు, స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారు కావచ్చు, ఇవాళ జగన్మోహన్ రెడ్డి గారు కావచ్చు. మీది రక్త చరిత్ర. మీ చేతులు రక్తంతో తడిచినాయి. తడిచిన రక్తం చేతులతో మీరు ఏ విధంగా మీరు ఇవాళ శాంతిభద్రతలకు సంబంధించిన అంశాన్ని సభలో ప్రస్తావిస్తారనే విషయాన్ని మేం అడుగుతున్నాం. మేం అడుగుతుందొక్కటే. మీకు ప్రజా సమస్యల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉంటే చర్చకు సహకరించండి.

పదకొండు మంది మా పార్టీ నాయకులు హత్యకు గురైనారని మీ నాయకుడే చెప్పినట్టుగా పత్రికల్లో ప్రచురితమైంది. కానీ మీరేమో 19 మంది అని నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంటే మసిపూసి మారెడుకాయ చేసే ప్రయత్నం మీరు చేస్తున్నారు. కానీ ఏది వాస్తవమో చెప్పవల్సిందిగా నేను అడుగుతున్నాను. తప్పుడు లెక్కలను తీసుకువచ్చి ఈనాడు సభలో అవాస్తవాలను మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నిండు సభలో అపహాస్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు.

(ప్రతిపక్షపార్టీ సభ్యులు సర్వశ్రీ జ్యోతుల నెహ్రూ, భూమా నాగిరెడ్డి, శ్రీమతి ఆర్.కె రోజ, శ్రీమతి జి. చరితారెడ్డి, జి.శ్రీకాంత్ రెడ్డి తదితరులు వెల్‌లో నిల్చొని "ప్రతిపక్షవర్గాలపై పాలక పక్ష అక్రమ కేసుల బనాయింపు అప్రజాస్వామికం, రాజకీయదాడులు, అక్రమ కేసుల బనాయింపులు, రాజకీయ హత్యలు నిరశించాలి" అని వ్రాసిన ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ సభకు అంతరాయం కల్గించసాగారు)

(న్యాయం జరగాలంటూ నినాదాలు చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోనిల్చొని సభకు అంతరాయం కల్గించసాగారు)

(అంతరాయం కొనసాగింపు)

మిస్టర్ స్పీకర్: నరేంద్ర కుమార్ గారు దయచేసి కూర్చోండి. జ్యోతుల నెహ్రూ గారూ మీరు మరియు మీ పార్టీ సభ్యులు కూడా దయచేసి మీ స్థానాలకు వెళ్లి కూర్చోండి. సభ సజావుగా జరిగేందుకు సహకరించండి. మీరు చెబుతున్న అంశం రేపటి సభాకార్యక్రమంలో పొందుపర్చబడింది. దయచేసి అందరూ సహకరించండి. మీ స్థానాలకు వెళ్లి కూర్చోండి.

Under Rule 344, your subject is posted for tomorrow. మీరు చర్చలో పాల్గొనండి. అంశంపైన చర్చించండి. మీ స్థానాలకు వెళ్లి కూర్చోండి. (అంతరాయం కొనసాగింపు) నరేంద్ర కుమార్ గారు మీరు కూడా దయచేసి కూర్చోండి.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

Your subject is posted for tomorrow. Please co-operate.

Your subject will be taken up tomorrow. Please co-operate. నేను పదే పదే మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. సభా సమయాన్ని వృధా చేయకండి. సభ సజావుగా జరిగేందుకు అందరి సహకారం కావాలి. Please listen to me. మీ సబ్జక్ట్ రేపటికి పోస్ట్ చేయబడింది. కానీ మీరు ఈ విధంగా పదే పదే పోడియం వద్దకు వచ్చి సభకు అంతరాయం కల్గించడం భావ్యం కాదు. దయచేసి అర్థం చేసుకోండి. (అంతరాయం కొనసాగింపు) It will be discussed tomorrow. మీ అన్ని అంశాలను మాట్లాడండి. అందరూ సీనియర్ సభ్యులే. దయచేసి సహకరించండి. సభా సమయాన్ని వృధా చేయకండి. (అంతరాయం కొనసాగింపు)

...

(అప్పటికే పోడియంలోచేరిఉన్న వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు "ప్రతిపక్ష నాయకులపై పాలకపక్ష దాడులు ఖండిస్తున్నాం" "ప్రతిపక్షంపై పాలకపక్ష అక్రమ కేసులు బనాయింపులు అప్రజాస్వామికం" "రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి" అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. "we want justice "we want justice" అంటూ నినాదాలు చేయసాగారు. హత్యా రాజకీయాలతో 19మందిని ప్రాణాలు విడిచారు " we want justice, we want justice " హత్యా రాజకీయలపై సభలో వెంటనే చర్చను చేపట్టాలంటూ పోడియంలో చేరి నినాదాలు కొనసాగించసాగారు. )

MR.SPEAKER: This subject is posted for tomorrow. Tomorrow it will be discussed. Now, please co-operate. Please allow the Leader of the House to make his statement. Please co-operte. Kindly remember I did not tell that the subject will be taken up today. Please co-operate. Please go back to your seats. The Government is prepared to answer. ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా మీరు సిద్ధంగా లేరు. రూల్ 344కన్నా ప్రాధాన్యం కల్గిన రూల్60 కింద కోట్ చేశాం. దయచేసి వినండి. ప్రభుత్వం సమయం అడిగింది, మీరడిగిన అంశంపై చర్చించేందుకు సిద్దంగా ఉంది. దయచేసి వినండి, కూర్చోండి.

(అంతరాయం)

మిస్టర్ స్పీకర్ : మీ సబ్జట్ రేపటికి పోస్ట్ చేయబడింది. ఆ మాత్రం ఓర్పులేకుండా సభకు అంతరాయం కల్గించవద్దు. దయచేసి కూర్చోండి.

(ఈ దశలో అధికార పార్టీకి చెందిన సభ్యులు ప్రతిగా హత్యా రాజకీయాలను సూచించే రెండు ఫోటోస్‌ను చూపుతూ "We want justice" "we want justic" అంటూ నినాదాలు చేశారు.)

(ఇరు పక్షాల సభ్యుల నినాదాలతో సభకు అంతరాయం)

MR.SPEAKER: Now, the House is adjourned for Fifteen Minutes.

**(The House then adjoruned for Fifteen Minutes at 12.06 pm.)**

...

**(స్వల్ప విరామానంతరం సభ తిరిగి మధ్యాహ్నం 1.14 గం.లకు ప్రారంభమయింది. గౌరవ సభాపతి అధ్యక్షస్థానం వహించారు)**

****

(సభ ప్రారంభం కాగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ స్పీకర్ః మీరు ఇచ్చిన రూల్-344 ను రేపటికి పోస్ట్ చేశాం. దయచేసి సభ నడవటానికి మీరు సహకరించాలి.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు తమ సీట్ల వద్ద నిలబడి రాజకీయ దాడులు, అక్రమ కేసులు బనాయింపులు, రాజకీయ హత్యలు నిరశించాలి, రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాలి, కొన్ని ప్లకార్డులను సభాపతి వైపు చూపిస్తూ సభకు అంతరాయం కలిగించారు.)

మీరు మాట్లాడబోయే ముందు... జగన్మోహన్ రెడ్డి గారూ... Whenever you wanted a time as a Leader of Opposition, It will be given to you. I will certainly ask to you speak, but unfortunately, when Leader of the House wanted to speak, there is a continuous disturbance. ఇది ఏం పద్దతి చెప్పండి. మీరు ఎక్కువ మాట్లాడినా మీకు టైం ఇచ్చారు. Leader of the House wanted to make a statement, and your party Members are continuously disturbing. ఇది కరెక్ట్ పద్దతి కాదు కదా?

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యులు శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తమ సీటు వద్ద నిలబడి మైకు లేకుండా రాష్ట్రంలో దోపిడి రాజ్యం, రౌడీ రాజ్యం ఉందని గట్టిగా తమ పార్టీ తరపున నిరసనను వ్యక్తంచేశారు)

మీకు అవకాశం వచ్చినప్పుడు అవన్నీ కూడా మాట్లాడుదురు గాని.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం కొనసాగింపు)

దయచేసి మీరు కూర్చోండి. Yes, Minister for Legislative Affairs.. లెజిస్లేటివ్ అఫైర్స్ మినిష్టరు గారూ..

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం కొనసాగింపు)

మిస్టర్ స్పీకర్ః దయచేసి ఇప్పుడైనా మీరు కూర్చోండి. లెజిస్లేటివ్ అఫైర్స్ మినిష్టరు గారూ..

శ్రీ యనమల రామకృష్ణుడుః అధ్యక్షా, సభను మనం ఎంత సజావుగా నడుపుకుంటే అన్ని సబ్జెక్టులు సభలోకి తీసుకురావడానికి అవకాశం ఉంటుంది. మేం రిక్వస్ట్ చేసేది ఒకటే. సిస్టం ఎట్లా ఉందో, రూల్స్ ఎలా ఉన్నావో, ఆ రూల్స్ ప్రకారంగా, సిస్టం ప్రకారంగా ఈ సభ నడవ వలసిన అవసరం ఉంది. ఇక్కడ ప్రతిపక్షం నిమిషానికి ఒకసారి లేచి అడ్డుపడి, ఈ జరుగుతున్న కార్యక్రమాలకు అడ్డు పడటం మంచిది కాదు. ఎందుచేతనంటే వారు కూడా కోఆపరేట్ చేయాలి.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ స్పీకర్ః మంత్రిగారిని మాట్లాడనీయండి..

SRI YANAMALA RAMAKRISHNUDU: Let me Speak, let me complete.. నిన్న కూడా ఇదేవిధంగా తంతు నడిచింది. అందుచేత ఇది మంచి సంప్రదాయం కూడా కాదు. ఎందుచేతనంటే నిన్న మీరు చెప్పారు. ఏదైతే మీకు అడ్జర్న్‌మెంట్ మోషన్ అండర్ రూల్ 60 కింద ఇచ్చారో, దానిని డిజ్ అలౌ చేశారు. డిజ్ అలౌ చేసిన తర్వాత వేరే ఫార్మేట్ కింద రమ్మన్నారు. వేరే ఫార్మేట్ కింద వచ్చారు. వచ్చిన తర్వాత దానిని మీరు పోస్ట్ చేయవలసిన అవసరం ఉంది. దానిని మీరు పోస్ట్ చేస్తారని అనుకొంటున్నాం అధ్యక్షా.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

MR SPEAKER: No running commentary please.

...

శ్రీ యనమల రామకృష్ణుడుః అదేవిధంగా, సిస్టం ప్రకారంగా రూల్-344 చర్చ విషయంలో మొదట రూలింగ్ పార్టీకి, ఆ తరువాత ప్రతిపక్షానికి ఛాన్స్ వస్తుంది. ఎందుకంటే, కొంతమంది మా సభ్యులు కూడా రూల్-344 కింద చర్చను కోరడం జరిగింది. దానిని కూడా కన్సిడర్ చేయవలసిన అవసరముంది. ప్రొసీజర్ ఫాలో కావాల్సిన అవసరముంది. బహుశా ప్రతి పక్షంలో, అధికార పక్షంలో కొత్తగా వచ్చిన సభ్యులకు రూల్స్, సిస్టం తెలియకపోవచ్చు. కాని, తెలుసుకోవాల్సిన బాధ్యత ఉంది. ఆ సిస్టంని, రూల్స్‌ని, మన సంప్రదాయాల్ని స్ట్రిక్ట్‌గా ఫాలో చేయవలసిన అవసరం ఉంది అధ్యక్షా. ఉదయం కూడా చెప్పడం జరిగింది. ఒక గంట క్వశ్చన్ అవర్ అంటే ఒక గంట మాత్రమే ఉండాలి. మనం సిస్టమేటిక్‌గా సభను నడుపుకున్నట్లయితే, ఎక్కువ ఇష్యూస్‌ను ఈ సభలో చర్చించగలము. మనం సిస్టమేటిక్‌గా నడుపుకోకుండా ప్రతీదీ కూడా ఏదో స్టాల్ చేద్దామనే పద్ధతిలో వెళ్తే ఒక్క ఇష్యూ కూడా సభలో రాదు, రావటానికి కూడా వీలుపడదు. అప్పుడు ప్రజలు నష్టపోతారు.

మీరు ప్రజలు ప్రజలు అంటున్నారు తప్ప మీకు ప్రజలపై అభిమానం లేదు. కాని మాకు వుంది. అందుకే ప్రజల గురించి మేము ఏర్పాటు చేయదలచుకున్న సెవెన్ మిషన్స్ గురించి డీటెయిల్డ్ స్టేట్‌మెంట్‌ను ఇద్దామనుకున్నాము. అది రాష్ట్రానికి సంబంధించినది. ప్రజలకి సంబంధించినది. ఆ సెవెన్ మిషన్స్ కూడా రాకుండా చేయాలని మీరు అడ్డుపడటం మంచిది కాదు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడదాం. దాని గురించి వేరే సందర్భంలో వేరే విధంగా మాట్లాడదాం. కానీ, అసలు సభలోనే లా అండ్ ఆర్డర్ లేకుండా చేయడం సరికాదు. మీరు ఏ క్వశ్చన్ అయినా అడగండి. మీరు ఏ ఇష్యూ అయినా డిస్కస్ చేయండి. రూల్స్ ప్రకారంగా, సంప్రదాయాల ప్రకారంగా మీరు ఏ విషయంపై డిస్కస్ చేద్దామన్నా మేము సమాధానం చెప్పడానికి, దాన్ని ఎదుర్కోనడానికి మేము సిద్ధంగా ఉన్నాం. దానిలో ఏవిధమైన అనుమానం లేదు. డిస్కస్ జరగకుండా, డిబేట్ జరగకుండా, క్వశ్చన్స్ వేయకుండా ఈవిధంగా సభను స్టాల్ చేయడం మంచి సంప్రదాయం కాదు. మంచి పద్ధతి కూడా కాదు. అందుచేత ప్రతిపక్ష సభ్యులు సహకరించాల్సిన అవసరం ఉంది.

మీరు డిఫరెంట్ ఫార్మాట్‌లో రండి. అదే డిఫరెంట్ ఫార్మాట్‌లో మేము కూడా తప్పకుండా సమాధానం చెబుతాం. మీరు 'లా అండ్ ఆర్డర్, లా అండ్ ఆర్డర్' అంటున్నారు. గతంలో జరిగిన ఇన్సిడెంట్స్ అన్నింటికి కూడా ఎవరు కారణం అనేది కూడా మేము చెప్పే సందర్భం వస్తుంది. ఏవిధంగా లా అండ్ ఆర్డరు ఫెయిల్ అయిందో అనే విషయం కూడా వస్తుంది. అందుచేత నేను ఇక్కడ డిబేట్‌లోకి పోవడం లేదు. ఇష్యూలోకి పోవడం లేదు. సాంప్రదాయాల్ని, సిస్టంను మనం ఫాలో కావాల్సిన అవసరముంది. అందుచేత ప్రతిపక్షం ఫాలో అవుతారని అనుకొంటున్నాను. అలాకాకుండా రోజూ ఇలానే చేస్తామంటే ప్రజలు నష్టపోతారు. ప్రజలు నష్టపోయే విధంగా సభలో మీరు ప్రవర్తించడం మంచిది కాదు అనేది కూడా ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రజలకు మనం సమాధానం చెప్పుకోవలసిన అవసరముంది.

మిస్టర్ స్పీకర్: జగన్ మోహన్ రెడ్డి గారూ..

శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి(పులివెందుల): అధ్యక్షా, రేపు బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. రేపు బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు కాబట్టి automatically మీరు కేటాయింపులు చేసే అంశాలను బట్టి, మిమ్మల్ని నిలదీసే కార్యక్రమం రేపటి నుంచి చేస్తాం. కానీ ఈ రెండు రోజుల్లో మాత్రం మనుషుల ప్రాణాల కన్నా... (అధికార పక్ష సభ్యులచే అభ్యంతరం) మనుషుల ప్రాణాల కన్నా, ఇంకా ముఖ్యమైన టాపిక్ ఏదైనా ఉంటుందా అని అడుగుతున్నాను. నేను ఒకటే అడుగుతున్నా అధ్యక్షా. నేను ఒకే ఒకటి సూటి ప్రశ్నను వేస్తున్నాను. మీరు ప్రభుత్వంలోకి వచ్చి మూడు నెలలయ్యింది. ఈ మూడు నెలల కాలంలో జరిగిన హత్యల గురించి మాట్లాడుతున్నామే తప్ప, గత చరిత్ర గురించి మాట్లాడటం లేదు. 'మీరు రంగాని చంపారు' అనే విషయం మాట్లాడడం లేదు.

(అధికార పార్టీ సభ్యులచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్: దయచేసి మీరు కూర్చోండి. జగన్మోహన్ రెడ్డి గారూ.. మీరు ఒక పాయింట్ మెన్షన్ చేశారు. దయచేసి కూర్చోండి.

(ప్రతిపక్ష పార్టీ సభ్యుల నుంచి అంతరాయం )

దయచేసి మీరు కూర్చోండి. Legislative Affairs Minister....

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, జగన్మోహన్ రెడ్డి గారు ఈ రెండు, మూడు నెలల గురించి మాట్లాడుతున్నారు. వాళ్ల నాన్నగారు అధికారంలో ఉన్నప్పుడు 2004 నుంచి 2009 వరకు కూడా ఏం జరిగాయి? అదేవిధంగా 2009 నుంచి ఇప్పటివరకు ఏం జరిగాయనే విషయాన్ని కూడా చర్చించాల్సివుంది. వీటన్నింటి గురించి చర్చించడానికి ప్రభుత్వం ఏమాత్రం వెనకాడడం లేదు. రూల్-344 కింద మీరు ఇచ్చిన ఇస్యూ వచ్చినప్పుడు వన్ బై వన్ డిస్కస్ చేద్దాం. దాదాపు 2004 నుంచి 2013 వరకూ జరిగిన సంఘటనలన్నీ కూడా ప్రభుత్వం డిస్కస్ చేయటానికి సిద్ధంగా ఉంది. ఈ రెండు నెలలే కాదు, మొత్తం డిస్కస్ చేయటానికి సిద్ధంగా ఉన్నాం. ఈ రాష్ట్రానికి మీరేం చేశారు? మీరెన్ని మర్డర్‌లు చేశారనే విషయాలన్నింటినీ చర్చిద్దాం?

అదేవిధంగా మీ నాన్నగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్ని మర్డర్లు జరిగాయనే విషయం కూడా చర్చించాల్సిన అవసరముంది. బయట 'లా అండ్ ఆర్డర్' పాడు చేసే సాంప్రదాయం మీపార్టీదే తప్ప తెలుగుదేశం పార్టీది కాదు. అక్కడా 'లా అండ్ ఆర్డర్' మెయిన్‌టెయిన్ చేయరు. ఇక్కడకు వచ్చి, ఈ సభలో సాంప్రదాయాన్ని కూడా మెయిన్‌టెయిన్

చేయరు. మీపార్టీని సంస్కృతి, సాంప్రదాయాలకు, కల్చర్‌కు వ్యతిరేకమైనటువంటి పార్టీగా మీరే చిత్రించబోతున్నారని గుర్తుంచుకోవాల్సిన అవసరముంది. కాబట్టి, దయచేసి, రేపు రూల్-344 అడ్మిట్ చేసినప్పుడు డిస్కస్ చేద్దాం. 2004 నుండి 2013 వరకు మీరేమి చేశారనే విషయం కూడా డిస్కస్ చేద్దాం. డిస్కస్ చేయడానికి రెడీగా ఉన్నామని కూడా ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం)

మిస్టర్ స్పీకర్: దయచేసి వినండి మీరు. మీకు ఒక వాస్తవం చెప్పాలి. Entire issue గురించి అసెంబ్లీలో 344 నోటీసు ఇచ్చినా, 304 నోటీసు ఇచ్చినా 24 గంటల్లో పోస్ట్ చేసిన సందర్భం ఎక్కడా లేదు. మీరు ఇచ్చిన నోటీసుకు సంబంధించిన సమాచారం ప్రభుత్వం జిల్లాల నుంచి తెప్పించుకోవాల్సి ఉంటుంది. సమయం పడుతుంది. 24 గంటలు కూడా ఓపిక లేకుండా చర్చ పెట్టాలని కోరడం కరెక్టు కాదు. Leader of the opposition మాట్లాడడానికి సమయమడుగుతున్నారు. Leader of the House మాట్లాడడానికి మీరు ఎలా చేయట్లేదు. డిస్టర్బ్ చేస్తూ వచ్చారు.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే సభకు అంతరాయం)

ఉన్నప్పుడు మాట్లాడించారా? Leader of the opposition ను మాట్లాడించాలని కోరినప్పుడు, అదే సాంప్రదాయాన్ని Leader of the House కు మీరు ఎందుకు ఇవ్వలేదు? మీకు ఎలా సాధ్యం? సభ ఎలా నడుస్తుంది? .... అచ్చెన్నాయుడు గారూ....

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం)

శ్రీ కింజరపు అచ్చెన్నాయుడు (టెక్కలి): అధ్యక్షా, గౌరవ ప్రతిపక్ష నాయకుడు ప్రాణాల గురించి మాట్లాడుతున్నారు. ఆరోజు శ్రీ పరిటాల రవి గారిని పట్టపగలు దారుణంగా చంపినప్పుడు, ప్రాణాల విషయం ఆయనకు గుర్తు రాలేదా? ఈ రాష్ట్రంలో కొన్ని వేలమందిని పట్టపగలు హత్య చేయించారు. పులివెందుల మార్కు రాజకీయాలను ఈ రాష్ట్రంలో నడపాలని చూస్తున్నారు.

(కొందరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వెల్‌లోకి వచ్చి 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ పదే పదే నినాదాలు చేయడంతో సభకు తీవ్ర అంతరాయం కలుగసాగింది)

ఇది మంచి పద్ధతి కాదు. ఎంతోమందిని కావాలని పట్టపగలు దారుణంగా హత్యచేయించారు. మీరు ఇప్పుడు ప్రాణాల గురించి మాట్లాడుతున్నారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ హత్యాంధ్రప్రదేశ్‌గా మారిందంటే, దానికి కారణం ఎవరు? మీ తండ్రిగారి వల్లే ఈరోజు ఈ రాష్ట్రం హత్యాంధ్రప్రదేశ్‌గా మారిపోయింది. మీరు ఈరకంగా మాట్లాడడం చాలా దారుణం. ఎంత దారుణమంటే, కొంతమంది కనీసం జైల్లోకి వెళితే ప్రాణాలు మిగులుతాయని జైల్లోకి వెళితే, జైల్లో కూడా చంపించినటువంటి చరిత్ర మీది. పరిటాల రవి కేసులో ముద్దాయిలుగా ఉన్నటువంటి ముద్దాయిలను కూడా, జైల్లోకి వెళ్ళి చంపించినటువంటి వారు మీరు. మీరు ఈరోజు హత్యారాజకీయాల గురించి మాట్లాడుతున్నారు. ఈరోజు ఈరాష్ట్రానికి హత్యాంధ్రప్రదేశ్ అని పేరొచ్చిందంటే, దానిక్కారణం మీరు కాదా? అని అడుగుతున్నాను.

(కొందరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు పోడియం వద్దకు దూసుకు వచ్చి సభకు అంతరాయం కలిగించసాగారు.)

కాబట్టి దయవుంచి, ఇప్పటికైనా మీరు ప్రజల యొక్క ఆలోచనలు అవగాహన చేసుకోండి. మీమీదున్న హత్యలన్నింటిని కప్పిపుచ్చుకోవడానికి, మీమీదున్న అవినీతి ఆరోపణలు కప్పిపుచ్చుకోవడానికి, కావాలని, మీరు ఈరకంగా అసెంబ్లీని స్టాల్ చేయడం మంచి పద్ధతి కాదు. ఈరోజు 'నాకేమీ అడగడానికి సమస్యలు లేవు కాబట్టి, రెండు రోజులు ఖాళీ ఉంది కాబట్టి ఈవిషయాన్ని తీసుకొచ్చామని' జగన్ మోహన్ రెడ్డి గారు అంటున్నారు. మీకు ప్రజల మీద ఏమాత్రం అవగాహన ఉన్నా సరే, ఈరకంగా మాట్లాడరు. హత్యలను ప్రోత్సహించినటువంటి వ్యక్తులు మీరు. హత్యలను ప్రోత్సహించినటువంటి కుటుంబం మీది. రాష్ట్రంలో ఎన్నో నియోజక వర్గాలున్నాయి. ఎన్నో జిల్లాలున్నాయి. కానీ, ఈ రాష్ట్రంలో పులివెందులలో జరిగిన హత్యల గురించి, మేము చెప్పడం కాదు, ఈరాష్ట్రంలో ఎవరిని అడిగినా చెబుతారు. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు...ఎక్కడా తప్పును ప్రోత్సహించడం లేదు. ఎవరు తప్పు చేసినా సరే, చట్టప్రకారం నిర్ణయాలు తీసుకునేటువంటి ఏకైక నాయకుడు, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు. కానీ, మీ నాన్నగారిలాగా హత్యలను ప్రోత్సహించి, ఈ రాష్ట్రంలో ఆ సాంప్రదాయాన్ని ప్రోత్సహించినటువంటి కుటుంబం మీది. ఇప్పటికైనా సరే మీరు దీనిని వదులుకొని చర్చలకు రండి అని కోరుతున్నాను.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం)

MR.SPEAKER: Please take your seats.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం)

Please take your seats.

(వెల్‌లోనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు 'హత్యా రాజకీయాలపై వెంటనే చర్చను చేపట్టాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయసాగారు.)

Now, the House is adjourned to meet again at 9.00 am tomorrow.

**(The House then adjourned at 1.30pm to meet again at 9.00 am on Wednesday, 20th August, 2014.)**